

నాణ్యత నగుబాటు..!

తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు పర్యవేక్షణలో ఎల్లెల్సీ కాలువ ఆర్‌సీసీ లైనింగ్ పనుల్లో నాణ్యత తుంగపాలు చేశారు. నిబంధనల మేరకు సిమెంట్, ఇనుము కడ్డీలు వినియోగించకపోవడంతో ఏడాది తిరక్కుండానే రాళ్లు, కడ్డీలు తేలుతున్నాయి. ఈ పనుల్లో బళ్లారిలో స్థిరపడిన వైసీపీ రంగు పూసుకున్న ఓ కాంట్రాక్టర్ హవా సాగుతోంది. వైసీపీ హయాంలో అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేల అండతో ఇష్టారాజ్యంగా పనులు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చినా ఆయన పెత్తనమే సాగుతోందని పలువురు కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఈ ఏడాది దాదాపు రూ.300 కోట్లతో లైనింగ్ పనుల కోసం తుంగభద్ర బోర్డు ఇంజనీర్లు సన్నాహాలు చేస్తున్నారు. గతేడాది చేసిన పనుల్లో నాణ్యతాప్రమాణాలు గాలికొదిలేసిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఆ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.



తుంగభద్ర బోర్డు పరిధిలోని ఎల్లెల్సీ కాలువలో చేసిన లైనింగ్ పనులు

- రూ.519.80 కోట్లతో తుంగభద్ర ఎల్లెల్సీ ఆర్‌సీసీ లైనింగ్
- వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా పనులు
- ఏడాది కాకుండానే కడ్డీలు తేలుతున్న వైనం
- వైసీపీ హయాంలో ఓ కాంట్రాక్టర్ హవా
- కూటమి ప్రభుత్వంలోనూ ఆయనదే పెత్తనం
- తాజాగా మరో రూ.300 కోట్లతో లైనింగ్ పనులకు సన్నాహాలు చేస్తున్న తుంగభద్ర బోర్డు ఇంజనీర్లు

కర్నూలు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర దిగువ కాలువ (టీబీపీ ఎల్లెల్సీ) కింద ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లో ఖరీఫ్, రబీలో 1,51,413 ఎకరాలు సాగునీరు, ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు పట్టణాలు సహా 139 గ్రామాలకు తాగునీరు అందాలి. తుంగభద్ర జలాశయం నుంచి 24 టీఎంసీల నీటి వాటా ఉంది. కర్ణాటకలోని హోస్పేట్ సమీపంలో గుండ్లకేరి వద్ద 0/0 కి.మీల నుంచి ఆదోని మండలం హానవాళ్లు దగ్గర 250.86 కి.మీ.ల వరకు ప్రధాన కాలువ తుంగభద్ర బోర్డు పర్యవేక్షణలో ఉంది. కాలువ గట్టు బలహీనం కావడం, పూడిక చేరడం నీటి ప్రవాహ సామర్థ్యం తగ్గి నీటి వాటాను కోల్పోతున్నారు. 2022-23లో తుంగభద్ర బోర్డు ఇంజినీర్లు 115.275 కి.మీ.లు నుంచి 205.45 కి.మీ.ల వరకు రూ.519.80 కోట్లతో ఆర్‌సీసీ లైనింగ్ పనులకు శ్రీకారం చుట్టారు. 9 ప్యాకేజీలుగా విభజించి ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగించారు. అప్పట్లో కాలువకు నీళ్లొచ్చే ముందు రాత్రి పగులు తేడా లేకుండా, ఇంజనీర్లు పర్యవేక్షణ లేకుండానే కాంట్రాక్టర్లు హడావుడిగా పనులు చేపట్టారు.

రాళ్లు, కడ్డీలు తేలిన లైనింగ్

వైసీపీ హయాంలో టీబీపీ బోర్డు పరిధిలోని ఎల్లెల్సీ సీసీ లైనింగ్ పనులు ఇష్టారాజ్యంగా చేపట్టారు. బళ్లారిలో స్థిరపడిన ప్రకాశం జిల్లాకు చెందిన వైసీపీ రంగు పూసుకున్న ఓ బడా కాంట్రాక్టర్ పెత్తనం సాగిందని అంటున్నారు. అప్పటి కర్నూలు, అనంతపురం జిల్లాకు చెందిన వైసీపీ ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధులకు భారీగా వాటాలు ముట్టజెప్పడంతో లైనింగ్ పనులు ఎలా చేసినా అడిగేవారేలేరని కాంట్రాక్టర్లే చెబుతున్నారు. మామ్ముళ్ల మత్తులో పర్యవేక్షణ ఇంజనీర్లు చూసీచూడనట్లు ఉన్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హలహర్వి, హొళగుంద మండలాలు పరిధిలో జరిగిన ఆర్‌సీసీ లైనింగ్ పనులు పరిశీలిస్తే దారుణ వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. కాలువ అడుగు భాగంలో ఎర్రమట్టి వేసి గట్టిపడేలా రోలింగ్ చేసి.. దానిపై ఆర్‌సీసీ బెడ్డు వేయాల్సి ఉంటే ఎర్రమట్టితో రోలింగ్ చేయకుండానే ఉన్న కాలువను చదును చేసి లైనింగ్ వేశారు. ఇనుము (స్టీల్) 10 ఎంఎం, 8 ఎంఎం కడ్డీలు వాడాలని నిబంధనల్లో ఉంటే.. తక్కువ మంద కడ్డీలు వాడారు. సిమెంట్ వినియోగంలో పొదుపు పాటించారు. ఫలితంగా వందేళ్లు రైతన్న సేవల్లో తరించాల్సిన కాలువ లైనింగ్ పనులు ఏడాది, రెండేళ్లు గడవకనే రాళ్లు, కడ్డీలు తేలిపోవడం చూస్తే ప్రమాణాలు ఏ స్థాయిలో నీటిపాలు చేశారో తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చినా.. బోర్డు పరిధిలో జరిగే పనుల్లో బళ్లారిలో స్థిరపడిన ప్రకాశం జిల్లాకు చెందిన వైసీపీ రంగు పూసుకున్న ఓ బడా కాంట్రాక్టర్ పెత్తనమే నేటికీ కొనసాగున్నట్లు పలువురు చెబుతున్నారు. బిల్లులు చెల్లింపుల కోసం గత నెలలో ఆ కాంట్రాక్టర్‌తో అనంతపురం జిల్లాకు చెందిన కూటమి ముఖ్య ప్రజాప్రతినిధులు చర్చలు జరిపారని, 7.5 శాతం వాటాలు పుచ్చుకొని బిల్లులు మంజూరు చేశారనే ఆరోపణలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే తుంగభద్ర బోర్డులో వైసీపీ నాయకులు, పార్టీ రంగు పూసుకున్న కాంట్రాక్టర్ల పెత్తనమే జరుగుతుండడంతో ఇదెక్కడి చోద్యం అంటూ కర్నూలు జిల్లాకు చెందిన తెలుగుతమ్ముళ్లు ముక్కున వేలేసుకుంటున్నారు.



ఎల్లెల్సీ 158 కి.మీ. బాపురం వద్ద కడ్డీలు తేలిన ఆర్‌సీసీ లైనింగ్

లైనింగ్ పనులకు సన్నాహాలు చేస్తున్నాం

కర్నూలు జిల్లాలో టీబీపీ బోర్డు పర్యవేక్షణలో ఉన్న ఎల్లెల్సీ కాలువ లైనింగ్ పనులు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. రూ.300 కోట్లతో ఈ పనులు చేస్తున్నాం. గత ప్రభుత్వంలోనే టెండర్లు ప్రక్రియ పూర్తయింది. నాణ్యత విస్మరిస్తే చర్యలు తీసుకుంటాం.

- నారాయణ నాయక్, ఎస్‌ఈ (ఎఫ్ఏసీ), తుంగభద్ర బోర్డు, హోస్పేట్:

ఈ పనుల్లోనైనా నాణ్యత పాటిస్తారా..?

2023 జనవరిలో ఫేజ్-2 కింద ఎల్లెల్సీ, హెచ్చెల్సీ కాలువల లైనింగ్ పనులకు రూ.400 కోట్లతో టెండర్లు పిలిచారు. ఈ టెండర్లు పిలవడంలోనే నిబంధనలు ఉల్లఘించారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఓ కాంట్రాక్టర్ తెలంగాణ హైకోర్టును కూడా ఆశ్రయించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ టెండర్లు రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలవాలని బళ్లారికి చెందిన ఓ కంట్రాక్టర్లు టీబీపీ బోర్డుకు, రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినా స్పందనం శూన్యం. కూటమి ప్రభుత్వం వచ్చాక.. వైసీపీ హయాంలో పనులు చేపట్టి పనులు పురోగతి 25 శాతం కంటే తక్కువ ఉంటే ఆ పనులు రద్దు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు టీబీపీ బోర్డుకు వర్తించవని చెబుతున్నారు. ప్రస్తుతం లైనింగ్ పనులు చేసేందుకు సన్నహాలు చేస్తున్నారు. తాజాగా చేపట్టే పనుల్లో బళ్లారికి చెందిన వైసీపీ కాంట్రాక్టర్‌కే ఎక్కువ శాతం పనులు ఉండడం, ఆయనకు లబ్ధి చేకూర్చేందుకే.. అనంతపురం జిల్లాకు చెందిన ముఖ్యమైన హోదాలో ఉన్న కూటమి ప్రజాప్రతినిధి ఒకరి ఒత్తిడి మేరకే బోర్డు ఇంజనీర్లు ఆ నిర్ణయం తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పనుల్లోనైనా నాణ్యతాప్రమాణాలు పాటించేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

శ్రీశైల క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



కంపార్టుమెంట్లలో వేచి ఉన్న భక్తులు

సున్నిపెంట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మల్లన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం భ్రమరాంబమల్లికార్జున స్వామివార్ల దర్శనార్థం వేల సంఖ్యలో భక్తులు వచ్చారు. ఆలయంలోని క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. భక్తుల దర్శనార్థం ఆదివారం ఉదయం 3గంటలకు ఆలయం తలుపులు తెరిచారు. స్వామిఅమ్మవార్లకు సుప్రభాతసేవ, మహా మంగళహారతి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనార్థం ఆలయంలోకి అనుమతించారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులతో దేవస్థానం ఏర్పాటుచేసిన క్యూకాంప్లెక్సు, క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. భక్తులకు దేవస్థానం వారు తాగునీరు, అల్పాహారం అందజేశారు. తెలుగు రాష్ట్రాల నుంచేకాక వివిధ ప్రాంతాల నుంచి భక్తులు శ్రీశైలానికి తరలివచ్చారు. సుమారు 40వేల మంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయాధికా రులు తెలిపారు.

స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవ

భ్రమరాంబమల్లికార్జున స్వామివార్లకు పల్లకీ సేవ నిర్వహించారు. ఉత్సవ మూర్తులను వెండి పల్లకీలో ఆశీనులను చేసి ఆలయ వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపహారతులు సమర్పించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల పల్లకీ సేవతో ఆలయ ప్రాంగణంలో ఉత్సవం నిర్వహించి కల్యాణం జరిపించారు.

వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు

ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని క్షేత్రపాలకుడైన బయలు వీరభద్రస్వామికి ప్రత్యేకపూజలు చేశారు. ఈపూజల్లో భాగంగా స్వామివారికి పంచామృతాభిషేకం, జలాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు. వీరభద్రస్వామికి జరిగిన పరోక్ష పూజల్లో కర్ణాటక, పంజాబ్, పశ్చిమబెంగాల్, బ్రిటన్‌కు చెందిన ప్రవాస భారతీ యులు పాల్గొన్నారు.



దర్శనానికి క్యూలైన్లలో వెళ్తున్న భక్తులు

నంద్యాల వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా సురేఖ



నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎ.సురేఖను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం పనిచేస్తున్న ప్రిన్సిపాల్ డా.శ్రీదేవి త్వరలో ఉద్యోగ విరమణ చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం సురేఖను ప్రిన్సిపాల్‌గా నియమించింది. ఈమె ప్రస్తుతం కడప ప్రభుత్వ మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. బదిలీపై నంద్యాలకు రానున్నారు.

కాంగ్రెస్ నాయకుడి దారుణ హత్య

7

- టిప్పర్‌తో ఢీకొట్టి.. కొడవళ్లతో నరికి
- ఆలూరు నియోజకవర్గంలో పడగవిప్పిన ఫ్యాక్షన్
- గుంతకల్లు నుంచి చిప్పగిరికి వస్తుండగా రైల్వే బ్రిడ్జి వద్ద ఘటన
- అప్రమత్తమైన పోలీసులు
- చిప్పగిరిలో భారీ బందోబస్తు



లక్ష్మీనారాయణ (ఫైల్)

పిడుగుపాటుకు ముగ్గురి మృతి

- మరో ఇద్దరికి గాయాలు
- కౌతాళం, క్రిష్ణగిరి మండలాల్లో విషాదం

కౌతాళం/క్రిష్ణగిరి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో పిడుగుపాటుకు ఆదివారం ముగ్గురు మృతిచెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. వివరాలివీ.. వేసవి సెలవులు కావడంతో కౌతాళం మండలంలోని కాత్రికి గ్రామానికి చెందిన తెలుగు చిన్న వీరేష్, పార్వతి దంపతుల కుమారుడు అశోక్(21), తలారి వీరేష్, మారెమ్మ దంపతుల కుమారుడు బాలయ్య(22)తో పాటు మరో ఎనిమిది బాలురు, యువకులు ఊరి సమీపంలోని పొలాల్లో క్రికెట్ ఆడేందుకు వెళ్లారు. అయితే గాలి వానతో పాటు వర్షం ఎక్కువ కావడంతో సమీపంలోని చెట్టు కిందకు చేరుకున్నారు. ఆ సమయంలో పిడుగు పడటంతో అశోక్, బాలయ్య అక్కడే స్పృహ కోల్పోయారు. నిరు పాది, గంగాధర్ గాయపడ్డారు. గ్రామస్థులు చికిత్స కోసం గంగాధర్‌ను హాల్వి గ్రామానికి తీసుకెళ్లారు. మిగతా ముగ్గురిని కౌతాళం పీహెచ్‌సీకి, అక్కడి నుంచి ఆదోని వైద్యశాలకు తీసుకెళ్లారు. కౌతాళం పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఏఎన్ఎం ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం ఆదోనికి తీసుకెళ్లాలని సూచించారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో బాధిత కుటుంబాల సభ్యులు, బంధువులు ఏఎన్ఎంతో వాగ్వాదానికి దిగారు. ఆ తర్వాత పీహెచ్‌సీ నుంచి 108 వాహనంలో ఆదోనికి తీసుకెళ్లారు. అయితే అంబులెన్స్ కూడా ఆలస్యంగా వచ్చిందని వారు అసహనం వ్యక్తం చేశారు. అయితే అప్పటికే అశోక్, బాలయ్య మృతి చెందినట్లు ఆదోని వైద్యులు నిర్ధారించారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాలయ్యకు గతేడాది వివాహం కాగా భార్య మీనాక్షి ప్రస్తుతం గర్భిణి. అశోక్ తల్లిదండ్రులతో పాటు వ్యవసాయం, కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు.



బాలయ్య (ఫైల్)



అశోక్ (ఫైల్)

క్రిష్ణగిరి మండలంలో రైతు..

మండలంలోని కటారుకొండ గ్రామానికి చెందిన బోయ శ్రీనివాసులు(52) పిడుగుపాటుకు ఆదివారం మృతి చెందారు. ఈదురు గాలులతో వర్షం కురువగా పొలంలో పనులు చేసుకుంటున్న శ్రీనివాసులు చెట్టు కిందకు వెళ్లారు. చెట్టుపై పిడుగు పడడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాసులుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

శ్రీశైలం జలాశయం భద్రతకు సన్నాహాలు

- నేడు నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఛైర్మన్ అనిల్ కుమార్ సమీక్ష
- అమరావతికి బయలుదేరిన ఎస్ఈ

కర్నూలు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భద్రతపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) దృష్టి సారించింది. ఇప్పటికే పలుమార్లు అధ్యయనం చేసిన ఎన్‌డీఎస్ఏ నిపుణులు ఇచ్చిన నివేదికల ఆధారంగా భద్రతా చర్యలకు ఉపక్రమిం చింది. తాజాగా ఎన్‌డీఎస్ఏ ఛైర్మన్ అనిల్‌కుమార్ సోమవారం అమరావతిలో శ్రీశైలం డ్యాం భద్రతపై సమీక్షించనున్నారు. ఇందుకు అవసరమైన ఫైళ్లతో శ్రీశైలం ప్రాజెక్టు ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి ఆదివారం రాత్రి అమరావతికి బయలు దేరారు. ఉమ్మడి రాష్ట్రంలో శ్రీశైలం దేవస్థానం వద్ద కృష్ణా నదిపై 1963 జూలై 24న 'శ్రీశైలం ప్రాజెక్టు' నిర్మాణానికి అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పునాది రాయి వేశారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావడానికి 20 ఏళ్లు పట్టింది. డ్యాం గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు. గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 308.04 టీఎంసీలు. వరద ప్రవాహ సామర్థ్యం (ఫ్లడ్ వాటర్ డిశ్చార్జ్ కెపాసిటీ) 13.20 లక్షల క్యూసెక్కులు. డ్యాంలో ఏటేటా పూడిక చేరడంతో.. 2011లో వరదనీటి లెక్కలు పరిశీలించి గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలుగా నిర్ధారించారు. 12 రేడియల్ క్రస్ట్ గేట్లు స్పిల్‌వే నుంచి వరద జలాలు కిందకు పడి.. మళ్లీ పైకెగిరి నదిలో పడే ప్లంజ్‌పూల్ ప్రాంతంలో భారీగా గుంత ఏర్పడింది. 2009 అక్టోబరులో డ్యాంకు 25.5 లక్షల క్యూసెక్కుల వరద చేరడంతో ప్లంజ్‌పూల్ గంత వల్ల డ్యాం భద్రతకు ముప్పు ఉందని పలు నిపుణుల కమిటీలు తేల్చి చెప్పాయి. వరద వల్ల డ్యాం కూడా దెబ్బతిందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. డ్యాం మరమ్మతుల కోసం డ్రిప్-2 కింద రూ.139 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ప్రాజెక్టును పరిశీలించిన ప్రపంచ బ్యాంక్ బృందం రూ.108 కోట్లు ఇచ్చేందుకు సమ్మతి తెలపడమే కాకుండా సబంధిత ఫైలుపై సంకతం కూడా చేసింది. అయితే.. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ముందుకు వెళ్లాల్సి ఉంది. ఈ నేపథ్యంలో నేషనల్ డ్యాం సేఫ్టి అథారిటీ ఛైర్మన్ అనిల్‌కుమార్ భద్రతా చర్యలకు ఉపక్రమించడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్ర ప్రభుత్వం రూ.108 కోట్ల ఫైలును క్లియర్ చేసి రాబోయే సీజన్‌లో డ్యాంకు వరద చేరే సమయానికి మరమ్మతులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

దీపం చిక్కులు

- సాంకేతిక సమస్యలతో అందని రెండో విడత రాయితీ
- దిక్కుతోచని స్థితిలో లబ్ధిదారులు
- పరిష్కారం చూపని గ్యాస్ ఏజెన్సీలు
- అందుబాటులో లేని పౌర సరఫరాల శాఖ అధికారులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12.15లక్షల మంది వినియోగదారులు



ఎన్నికల వేళ ఇచ్చిన హామీల్లో భాగంగా 'సూపర్ సిక్స్' అమలుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీపం పథకం పేరుతో ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీని ప్రారంభించింది. అక్టోబర్ 31వ తేదీ నుంచి మార్చి 31వరకు తొలి విడత ఈ పథకం కొనసాగింది. అప్పట్లో చిన్నచిన్న సమస్యలున్నా వాటిని అధిగమించింది. రెండో విడతలో భాగంగా ఏప్రిల్ 1వ తేదీ నుంచి దీపం-2.0 ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో సాంకేతిక సమస్యలు చుట్టుకున్నాయి. లబ్ధిదారులు గ్యాస్ తీసుకున్న తర్వాత సబ్సిడీ బ్యాంకు ఖాతాల్లో జమ కావడం లేదు. ఏజెన్సీల వారికి ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. సంబంధిత పౌర సరఫరాల శాఖ అధికారులకు సమస్యలు తెలియజేయాలంటే వారు అందుబాటులోకి రావడం లేదు.

ఆత్మకూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): దీపం 2.0 పథకానికి సాంకేతిక చిక్కులు వచ్చిపడ్డాయి. దీంతో రెండో విడత ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి సంబంధించి రాయితీ సాయం అందడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. గతేడాది దీపావళి పండుగ సందర్భంగా దీపం-2.0 పేరిట ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. అక్టోబరు 31 నుంచి మార్చి 31వ తేదీ వరకు తొలి విడత కాగా, ఏప్రిల్ 1 నుంచి జూలై 31వ తేదీ వరకు రెండో విడత ఉచిత గ్యాస్‌సిలిండర్లను ఇస్తామని ప్రభుత్వం పేర్కొంది. ఈ పథకానికి అర్హత కలిగిన లబ్ధిదారులు నిర్దేశించిన నెలల్లో ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఉచిత గ్యాస్ సిలిండర్ వినియోగదారులు ముందుగా గ్యాస్ ఏజెన్సీ వారికి నగదు చెల్లించి సిలిండర్ పొందిన 48 గంటల తర్వాత ఆధార్, బ్యాంకు ఖాతాలకు లింకైన గ్యాస్ వినియోగదారుల బ్యాంకు ఖాతాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.41, రాష్ట్ర ప్రభుత్వం తరుపున రూ.817 చొప్పున రాయితీ జమ అయ్యేది. తొలి విడతలో ఈ పథకం అమల్లో కొంత సాంకేతిక సమస్యలు తలెత్తినప్పటికీ చాలామంది లబ్దిదారులకు రెండు, మూడు రోజుల ఆలస్యమైనప్పటికీ నగదు సాయం అందినట్లు తెలిసింది. రెండో విడతలో మాత్రం అధికసంఖ్యలో లబ్ధిదా రులకు నేటికీ ఉచిత గ్యాస్ సిలిండర్ రాయితీ బ్యాంకుఖాతాల్లో జమ కాకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. అయితే దీనిపై కొందరు సాంకేతిక పరమైన సమస్యల వల్ల రాయితీ జమకాలేదని చెబుతున్నప్పటికీ మరికొందరు మాత్రం బడ్జెట్ అందుబాటులో లేకపోవడం వల్ల రాయితీ రావట్లేదని ప్రచారం చేస్తున్నారు.

ఏప్రిల్ 1వ తేదీ నుంచే బుకింగ్..

దీపం-2.0 పథకంలో భాగంగా రెండో విడత ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా వినియోగదారులు ఏప్రిల్ 1నుంచే సిలిండర్ల కోసం బుకింగ్ చేసుకున్నారు.

మిగతా 7వ పేజీలో

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ రంజిత్ బాషా



కర్నూలు కలెక్టరేట్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ సూచనల ప్రకారం రాగల నాలుగు ఐదు రోజుల్లో జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ఉరుములుతో కూడిన వర్షం పడే సమయంలో పిడుగులు పడే అవకాశం ఉండటంతో ప్రజలు చెట్ల కింద, బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని సూచించారు. పొలాల్లో పనిచేసే రైతులు, బహిరంగ ప్రదేశాల్లో పని చేసేవారు, రైతులు, పశువుల కాపరులు, గొర్రెల కాపరులు సురక్షిత ప్రాంతాల్లోకి వెళ్లాలని పేర్కొన్నారు. అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని, ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

దీపం చిక్కులు



5వ పేజీ తరువాయి

వారు నగదు చెల్లించి గ్యాస్ సిలిండర్లను పొందినప్పటికీ నేటికీ బ్యాంకు ఖాతాల్లో సబ్సిడీ సాయం అందలేదు. ఈ సమస్యను అడిగేందుకు పౌర సరఫరాల శాఖ అధికారులెవరూ సామాన్యులకు అందుబాటులో దొరకడం లేదు. అదేక్రమంలో తమ సమస్యను అడిగేందుకు గ్యాస్ఏజెన్సీల వద్దకు లబ్ధిదారులు క్యూలు కడుతున్నప్పటికీ వారు సైతం తమకేమీ తెలియదని చేతులెత్తేస్తున్నారు. కనీసం ఫలానా కారణాల వల్ల రాయితీ సాయం రాలేదని కూడా చెప్పకపోవడంపై వినియోగదారులు మండిపడుతున్నారు. క్షేత్రస్థాయిలో ఈపథకం అమలు తీరుపై పౌరసరఫరాల శాఖల అధికారులు కూడా దృష్టి సారించలేదన్న విమర్శలున్నాయి. ఈ సమస్యపై వివరణ తీసుకునేందుకు సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారులను ఫోన్‌లో సంప్రదించినప్పటికీ వారు స్పందించకపోవడం గమనార్హం. మొత్తానికి ఈ పథకం ఆశయం బాగానే ఉన్నప్పటికీ ఆచరణలో మాత్రం పురిటినొప్పులు తప్పడం లేదు.

అనర్హులు వీరే..

ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం పలు నిబంధనలు ప్రవేశపెట్టి అర్హతను ఎంపికచేశారు. ఇందులో ప్రత్యేకించి ఆదాయపన్ను చెల్లించేవారు, మున్సిపాలిటీల పరిధిలో 1000 చదరపు అడుగుల ఇంటి పన్ను చెల్లిస్తున్న వారు, నాలుగు చక్రాల వాహనం కలిగిన వారు, 300 యూనిట్ల విద్యుత్ బిల్లులు చెల్లించేవారు, మూడెకరాల మాగాణి లేదా పదెకరాల మెట్ట భూమి కలిగిన వారు దీపం -2.0 పథకానికి అనర్హులుగా గుర్తించారు. అదేక్రమంలో రేషన్‌కార్డు, ఆధార్, గ్యాస్ నంబర్‌కు అనుసంధానమైన వారు ఈ పథకానికి అర్హులను నిర్ణయించారు. అయితే ఈ పథకానికి అర్హత కలిగిన వారికి కూడా ఉచిత గ్యాస్ సిలిండర్ల రాయితీ రాకపోవడం గమనార్హం.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గ్యాస్ వినియోగదారుల వివరాలు

విభాగం	నంద్యాల	కర్నూలు
1.దీపం	1,55,323	2,04,629
2.ఉజ్వల	33,732	46,824
3.సీఎస్ఆర్	21,505	11,436
4.జనరల్	3,66,881	4,11,496
మొత్తం :	5,77,441	6,74,385



ప్రతి హామీని నెరవేరుస్తాం

● రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



కర్నూలు అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేరుస్తామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మత్స్యకారులకు వేట విరామ సమయంలో ఆర్థికసాయాన్ని రూ. 10వేల నుంచి రూ.20 వేలకు పెంచినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా 1,29,178మంది మత్స్యకార కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని వివరించారు. రాష్ట్రంలో 555 మత్స్యకార గ్రామాలు న్నాయని, దేశంలో ఉత్పత్తి అయ్యే మత్స్యసంపద 29శాతం మన రాష్ట్రం నుంచే ఉంటోం దన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే చేపలు తినాలని మంత్రి సూచించారు.

నేడు ఉమ్మడి జిల్లా బీచ్ కబడ్డీ జట్ల ఎంపిక

నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక నందమూరినగర్ నాగులకట్టవద్ద సోమవారం ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల బీచ్ కబడ్డీ మహిళా, పురుషుల జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి ఏపీ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పురుషులు 85కేజీల్లోపు, మహిళలు 75కేజీల్లోపు ఉండాలని, క్రీడాకారులు 10వ తరగతి మార్క్‌లిస్ట్, ఆధార్‌కార్డుతో హాజరుకా వాలని అన్నారు. ఎంపికైన జిల్లా జట్లు మే 2నుంచి 4వరకు కాకినాడలో జరిగే 12వ ఆంధ్రప్రదేశ్ అంతర్‌జిల్లాల బీచ్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సుధాకర్, నాగరాజు, భరతరెడ్డి, శివలింగమయ్య, సురేష్‌నాయుడు, రాజేష్ పాల్గొన్నారు.

రంగస్థల నటనలో శిక్షణ

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో మే 5 నుంచీ రంగస్థల నటనలో శిక్షణ ఇవ్వనున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'నా బంగారు తల్లి' చిత్రానికి సహాయ దర్శకుడిగా పనిచేసిన జల్లు కుమార్ పర్యవేక్షణలో ఇస్తామన్నారు. 16-35 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన యువత ఈ శిక్షణలకు అర్హులని, కనీసం పదో తరగతి పాసై ఉండాలని వివరించారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 7 గంటల వరకు ఉంటాయని, శిక్షణ కాలం మే5 నుంచి మే15 వరకు ఉంటుందని, శిక్షణ పూర్తి చేసుకున్న కళాకారులతో మే 16న నాటక ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు తమ పూర్తి వివరాలు తెలిపే బయోడేటా, ఆధార్ జిరాక్స్, కలర్ ఫోటో, పది ఆపై విద్యార్హతల ధృవీకరణ పత్రాల జిరాక్స్‌లతో టీజీవీ కళాక్షేత్రంలో మే 3న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరిగే ఎంపికలకు హాజరు కావాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ముగ్గురికి గాయాలు

నంద్యాల టౌన్ ఏప్రిల్, 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. ఈఘటన గోస్పాడు మండలంలోని సాంబవరం మెట్ట వద్ద జరిగినట్లు నంద్యాల ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వివరాలు.. గాజుల పల్లెకు హుసేన్‌వలి, అమీనా, మస్తాన్, సాంబవరానికి చెందిన పెద్దయ్య ఆదివారం సాయంత్రం యర్రగుంట్ల వద్ద ఉన్న దర్గాకు ఆటోలో వెళ్లి తిరిగివస్తున్న క్రమంలో వెనుక నుంచి స్కార్పియో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో హుసేన్‌వలి(50) అక్కడికక్కడే మృతిచెందాడు. మిగిలిన వారికి గాయాలయ్యాయి. చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పెద్దయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎర్రమట్టి ట్రాక్టర్లు సీజ్



సీజ్ చేసిన ఎర్రమట్టి ట్రాక్టర్లు

సి.బెళగల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఎర్రమట్టిని తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఎర్రమట్టి కొండలో నుంచి సి.బెళగల్‌కు చెందిన నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తిమ్మప్ప తెలిపారు. బ్రాహ్మణదొడ్డి, సంగాల, పోలకల్లు, సి.బెళగల్ గ్రామాల్లో నుంచి ఎర్రమట్టిని తరలిస్తే ట్రాక్టర్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

కాంగ్రెస్ నాయకుడి దారుణ హత్య

● టిప్పర్‌తో ఢీకొట్టి.. కొడవళ్లతో నరికి
● ఆలూరు నియోజకవర్గంలో పడగవిప్పిన ఫ్యాక్షన్
● గుంతకల్లు నుంచి చిప్పగిరికి వస్తుండగా రైల్వే బ్రిడ్జి వద్ద ఘటన
● అప్రమత్తమైన పోలీసులు
● చిప్పగిరిలో భారీ బందోబస్తు

చిప్పగిరి/ఆలూరు/కర్నూలు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గంలో ఫ్యాక్షన్ పడగవిప్పింది. కొన్నేళ్లుగా స్తబ్దుగా ఉన్న ముఠాకక్షలు మళ్లీ బయటపడ్డాయి. ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధ్యక్షుడు చిప్పగిరి లక్ష్మీనారాయణ(52) ఆదివారం దారుణహత్యకు గురయ్యారు. ప్రత్యర్థులు పక్కా ప్రణాళిక ప్రకారం ఆయన ప్రయాణిస్తున్న కారును టిప్పర్‌తో ఢీకొట్టి.. ఆపై కొడవళ్లతో నరికి దారుణంగా హత్యచేశారు. ఈ ఘటన అనంతపురం జిల్లా గుంతకల్లు సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో జరిగింది. ఆయన ప్రమాణిస్తున్న వాహనంలో లక్ష్మీనారాయణ కుమారుడు వినోద్‌కుమార్, అనుచరుడు గోవిందు ఉన్నారు. ఈ దాడిలో లక్ష్మీనారాయణ తలపై, వీపుపై విచక్షణారహితంగా నరికారు. ఆయన కుమారుడు వినోద్‌కుమార్, గోవిందు కూడా గాయపడ్డారని గుంతకల్లు పోలీసులు తెలిపారు. ఆ ముగ్గురిని గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన లక్ష్మీనారాయణ చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈవిషయం తెలియగానే ఆయన భార్య, కుటుంబ సభ్యులు, చిప్పగిరి గ్రామస్థులు పెద్ద సంఖ్యలో గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. తాము గుంతకల్లు నుంచి చిప్పగిరి వెళ్తున్నామని, రైల్వే బిడ్జి వద్ద కారును టిప్పరుతో ఢీకొట్టి.. ఎనిమిది మంది వేట కొడవళ్లతో లక్ష్మీనారాయణను విచక్షణారహితంగా నరికి పారిపోయారని అదే దాడిలో గాయపడిన వినోద్ కుమార్, గోవిందు వివరించారు. ఎన్నో ఏళ్ల తరువాత కాంగ్రెస్ నేత హత్యకు గురికావడంతో ఆలూరు నియోజకవర్గం ముఖ్యంగా చిప్పగిరి ఉలికిపాటుకు గురైంది. ఎప్పుడు ఏం జరుగుతుందో..? అంటూ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఘటనా స్థలాన్ని గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు మనోహర్, ఏపీ మస్తాన్ హత్య జరిగిన తీరును, ఢీకొట్టిన టిప్పరు, కారును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హత్యకు గురైన లక్ష్మీనారాయణ భార్య నరసమ్మ, కుమారులు వినోద్‌కుమార్, శివ, ఒక కుమార్తె రోదనలతో ఆస్పత్రి ప్రాంగణం శోకసంద్రంగా మారింది. హత్యను ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు గుంతకల్లులో ధర్నా చేశారు. గుంతకల్లు ఒకటవ పోలీస్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్యాక్షన్ హత్యేనా.. మరో కారణమా..?

కర్నూలు జిల్లా కీలక టీడీపీ నేత, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ వైకుంఠం శ్రీరాములు, ఆయన సతీమణి శకుంతలమ్మ దంపతులను 2007 నవంబరు 18న ఇంట్లోనే అత్యంత కిరాతకంగా హతమార్చారు. ఈ జంట హత్యల కేసులో చిప్పగిరి లక్ష్మీనారాయణ ఏ-7 నిందితుడు. ఆ తర్వాత న్యాయస్థానం ఆ కేసులు కొట్టివేసింది. ఆ సమయంలో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా ఉన్న మూలింటి మారెప్ప సహచరుడిగా చిప్పగిరి లక్ష్మీనారాయణ ఉన్నారు. అదే సమయంలో ఆలూరు మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా పని చేశారు. ఆ తరువాత కేంద్ర మాజీమంత్రి, ప్రస్తుత డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి అనుచరుడిగా కాంగ్రెస్ పార్టీలో కీలక నాయకుడిగా ఎదిగారు. కోట్ల దంపతులు 2019 ఎన్నికల ముందు టీడీపీలో చేరినా ఆయన మాత్రం కాంగ్రెస్‌లోనే కొనసాగుతూ వచ్చారు. ప్రస్తుతం ఆపార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షుడిగా కూడా కొనసాగుతున్నారు. వ్యక్తిగత పనులపై గుంతకల్లు వెళ్లి వస్తుండగా లక్ష్మీనారాయణ హత్యకు గురయ్యారు. ముఠాకక్షల్లో భాగంగానే ఈ హత్య జరిగిందా..? మరే ఇతర కారణాలు ఉన్నాయా..? అనే కోణాల్లో పోలీసులు ఆరా తీస్తున్నారు. కుమారుడు వినోద్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు గుంతకల్లు పోలీసులు తెలిపారు. కాగా.. పది రోజుల క్రితం లక్ష్మీనారాయణ కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను కలసి తనకు ప్రాణహాని ఉందని, భద్రత కల్పించాలని విన్నవించినట్లు తెలిసింది.



లక్ష్మీనారాయణ మృతదేహం

చిప్పగిరిలో భారీ బందోబస్తు

లక్ష్మీనారాయణ దారుణ హత్య నేపథ్యంలో చిప్పగిరిలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి చిప్పగిరికి వెళ్లి బందోబస్తును పర్యవేక్షించారు. ఎస్ఐ సతీశ్ ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీ, హతుడు ఇంటి వద్ద, బస్టాండ్ ప్రాంతంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. లక్ష్మీనారాయణ మృతిపై మాజీ మంత్రి మూలింటి మారెప్ప, ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, మాజీ ఎమ్మెల్యే మసాలా పద్మజ, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్, ఎంఆర్‌పీస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాశ్, తాలూకా అధ్యక్షుడు కత్తి రామాంజినేయులు, డివిజన్ అధ్యక్షులు ఎల్లప్ప, మసాలా జగన్ తమ ప్రగాడ సానుభూతి తెలిపారు.



టిప్పర్‌తో కారును ఢీ కొట్టిన దృశ్యం

లక్ష్మీనారాయణ హత్య దారుణం

● నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి
● సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్. రఘువీరారెడ్డి

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య దారుణమని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సభ్యుడు, మాజీ మంత్రి ఎన్.రఘు వీరారెడ్డి అన్నారు. ఆదివారం సంఘటన జరిగిన వెంటనే కర్నూలు, అనంతపురం జిల్లాల ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి, చిప్పగిరి లక్ష్మీ నారాయణ హత్య జరిగిన తీరు, తీసుకుంటున్న చర్యలపై అడిగి తెలుసుకున్నారు. హంతకులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి, కర్నూలు జిల్లా వ్యవహారాల ఇన్‌చార్జి అంబటి రామకృష్ణయాదవ్ మాట్లాడుతూ లక్ష్మీనారాయణ హ్యతను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కర్నూలు సీటీ అధ్యక్షులు షేక్ జీలాని బాషా మాట్లాడుతూ హత్య చేసిన దుండగులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

లక్ష్మీనారాయణ హత్య బాధాకరం

నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్



కల్లూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆలూరు కాంగ్రెస్ ఇన్‌చార్జి లక్ష్మీనారాయణ దారుణహత్య అత్యంత బాధాకరమని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు లక్ష్మీనరసింహా యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లక్ష్మీనారాయణ కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. హంతకులను పట్టుకొని కఠిన శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగదు

● మంత్రి ఎన్ఎండీ ఫరూక్



జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల ఎడ్యుకేషన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఏ ఒక్క రైతుకు అన్యాయం జరుగకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. నంద్యాల మార్కెట్‌యార్డులో పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో ఆదివారం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించి మాట్లాడారు. జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి రైతులకు అండగా ఉన్న సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. జొన్నలకు మార్కెట్లో ధరలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని సీఎం, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి రూ.3371ల ప్రభుత్వ మద్దతు ధరతో అత్యంత వేగంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 30వేల మెట్రిక్ టన్నుల జొన్నల కొనుగోలుకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిందన్నారు. కొందరు రైతులు సంచులు బాగాలేవని మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే వెనక్కి తీసుకొని మంచి సంచులను అందజేయాలని పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రాజునాయక్‌ను ఆదేశించారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పది, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన కురువ విద్యార్థులకు పురస్కారాలు అందించేందుకు దరఖా స్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కురువ సంఘం అధ్యక్షులు పత్తికొండ శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు కె.కిష్టన్న, అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, అన్నారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ కురువ సంఘం ఆధ్వర్యంలో కురువ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించేందుకు తీర్మానించినట్లు తెలిపారు. 2024-25 పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుతమ ప్రతిభ కనబరచిన ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారు 500 మార్కులుపైగా, ప్రైవేటు పాఠశాలలో చదివినవారు 550 మార్కులుపైగా వచ్చిన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాలలో చదివిన విద్యార్థులు 850 మార్కులు, ప్రైవేటు కాలేజీల్లో చదివిన విద్యార్థులు 900 మార్కులు పైగా వచ్చిన వారు తమ మార్కుల జాబితా, కుల ధృవీకరన సర్టిఫికెట్ జిరాక్స్ కాపీని మే 5వ తేదీలోపు 9440756199, 9032741194 నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపాలని తెలిపారు. కార్యక్ర మంలో మహిళా సంఘం అధ్యక్షురాలు శ్రీలీలమ్మ, ప్రధాన కార్యదర్శి అనిత, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, కే.ధనుంజయ, కేసీ నాగన్న, కొత్తపల్లి నాగేంద్ర, బీసీ తిరుపాల్ తవుడు శ్రీనివాసులు, పాల సుంకన్న, బీసీ తిరుపాల్, పెద్దపాడు పుల్లన్న, బి.బాలరాజు, కే.మద్దిలేటి, కే.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

● సైబర్ నేరాలపై అవగాహన
● అనుమానితులు, నేరచరిత్ర గల వారిపై నిఘా
● ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా
● జిల్లాలోని పలు ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్
● నంద్యాలలో 49 వాహనాలు సీజ్



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నంద్యాల క్రైం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయమని నంద్యాల ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. ఆదివారం తెల్లవారుజామున జిల్లాలోని పలు ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతిరోజు సిబ్బంది వారి స్టేషన్ పరిధిలోని నేరచరిత్ర గలవారిపై, అనుమానితులపై, రాత్రిపూట అనవసరంగా రోడ్లపై తిరిగేవారిపై నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. నంద్యాలలోని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవనగర్‌లో సీఐలు కంబగిరిరాముడు, ఇస్మాయిల్, సుధాకర్‌రెడ్డి, ఎస్సైలు, క్యూఆర్టీ సిబ్బంది దాడిచేసి సరైన ధృవపత్రాల్లేని 49వాహనాలు సీజ్ చేశారన్నారు. ఆత్మకూరు సబ్ డివిజన్‌లోని మూడు ప్రదేశాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించి టౌన్ సీఐ రాము, సిబ్బంది ఏటీఎంపాలెం, గొల్లపేట, కొట్టాలచెరువుల్లో 20లీటర్ల నాటుసారా చేశారని, ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నందికొట్కూరు సీఐ ప్రకాష్, సిబ్బంది పట్టణంలోని షికారిపేటలో 30లీటర్ల నాటుసారా సీజ్‌చేసి 500లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ముచ్చుమర్రి ఎస్సై, సిబ్బంది లక్ష్మాపురం గ్రామంలో 18క్వార్టర్ విస్కీ బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.

చనిపోతూ ముగ్గురికి పునర్జన్మ

● కిడ్నీ, లివర్, కళ్లు దానం చేసిన నర్సిబాయి కుటుంబ సభ్యులు



నర్సిబాయి

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో అన్నీ తానై చూసుకునే మహిళ మరణించిన తర్వాత ముగ్గురికి ప్రాణదానం చేసింది. పుట్టెడు దుఖంలో ఉన్నప్పటికీ వారి కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం ఎందరికో స్ఫూర్తిదాయకమైంది. తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా బొంకూరుకి చెందిన కటికె నర్సిబాయి(55) గృహిణి. ఈ నెల 25వ తేదీ తీవ్ర తలనొప్పి వచ్చి కింద పడిపోవడంతో స్థానిక హాస్పిటల్‌కు తీసుకుని వచ్చారు. అక్కడే ఆమె కోమాలోకి వెళ్లారు. దీంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. రోగిని పరిశీలించిన వైద్యులు తల లోపల కుడి భాగంలో తీవ్ర రక్తస్రావం అయినట్లు గుర్తించారు. చికిత్స పొందుతూ ఆమె శనివారం బ్రెయిన్‌డెడ్ అయ్యారు. ఆ తర్వాత అవయవదానంపై ఏపీ జీవన్‌దాన్ సమన్వయకర్త డా.రాంబాబు బృందం, కిమ్స్ హాస్పిటల్‌లోని అవయవదాన సమన్వయకర్తలు నర్సిబాయి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. అనంతరం భర్త, కుమారుడు అంగీకారంతో లివర్, రెండు కిడ్నీలు దానం చేశారు. లివర్, ఒక కిడ్నీ కర్నూలుకు మరో కిడ్నీ నెల్లూరు, రెండు కళ్లను కర్నూలు రెడ్‌క్రాస్‌కు గ్రీన్‌చానల్ ద్వారా తరలించారు. చనిపోతూ కూడా మరో ముగ్గురికి ప్రాణదానం చేయడం తమకు గర్వంగా ఉందని మృతురాలి భర్త, కుమారుడు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

సి. బెళగల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని బురాన్‌దొడ్డికి చెందిన బోయ కమ్మరికాలప్ప(52) సి.బెళగల్‌లో బాషా బండల డిపోలో పనిచేస్తున్నాడు. ఆదివారం బండల డిపోలో కట్‌చేసిన బండను తొలగించి చేతులు కడుక్కోవడానికి మోటార్‌ను ఆన్‌చేశాడు. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరుకు తరలించినట్లు హెడ్ కానిస్టేబుల్ తిమ్మప్ప తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కు మృతిచెందాడని, బాధిత కుటుంబాన్ని బండల డిపో యజమాని ఆదుకోవాలని బురాన్‌దొడ్డి గ్రామస్థులు కోరుతున్నారు. కాలప్ప మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

పిడుగుపాటుకు వృషభాలు, గేదె మృతి

పెద్దకడుబూరు, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపురం, చిన్నకడుబూరులో ఆదివారం సాయంత్రం పిడుగుపడి రెండు వృషభాలు, ఒక గేదె మృతిచెందింది. రంగా పురం గ్రామానికి చెందిన ఈతచెట్టు చిన్న మాదన్నకు చెందిన వృషభాలను పొలంలోని చెట్టుకింద కట్టివేశాడు. సాయంత్రం పిడుగు పడడంతో రెండు ఎద్దులు అక్కడికక్కడే మృతిచెందాయి. వీటి విలువ రూ.1.50 లక్షలు ఉన్నట్లు రైతు చిన్నమాదన్న తెలిపారు. చిన్నకడుబూరులో హనుమంతురెడ్డికి చెందిన గేదె పిడుగుపాటుతో మృతి చెందింది. గేదె విలువ రూ.40వేలు ఉన్నట్లు రైతు హనుమంతురెడ్డి తెలిపారు.

మల్కాపురంలో గడ్డివామిపై..

ఎమ్మిగనూరు రూరల్: మండలంలోని మల్కాపురంలో లక్ష్మన్న కుమారుడు వీరేష్‌కు చెందిన గడ్డివామిపై పిడుగు పడింది. గ్రామ చివరిలో బసాపురం రోడ్డువైపు రైతు వీరేష్ పశువుల మేత కోసం దాదాపు 10ఎద్దుల బండ్ల గడ్డివామి వేసుకున్నాడు. ఆదివారం సాయంత్రం గడ్డివామిపై పిడుగుపడడంతో దగ్ధమైంది. దీని విలువ దాదాపు రూ.60వేలు ఉంటుందని రైతు వీరేష్ తెలిపాడు.

మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం రాకతో మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నిండాయని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మత్స్యకారులకు వేట నిషేధిత సమయంలో రూ.20వేల సాయం అందిస్తామన్న హామీ మేరకు సీఎం చంద్రబాబు పథకాన్ని ప్రారంభించారని ఎమ్మె ల్యే సూచించారు. రాష్ట్రంలో 1,29,778 మంది మత్స్యకార కుటుంబా లకు రూ.259 కోట్ల మేర లబ్ధి చేకూరుతుందన్నారు. సముద్రంలో చేపల వేట నిషేధిత సమయంలో మత్స్యకారులు ఇబ్బంది పడ కుండా ఆర్థికంగా సాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింద న్నారు. హామీ ప్రకారం రూ.10వేల నుంచి 20వేలకు మత్స్యకారుల ఆర్థిక సాయాన్ని పెంచి సంక్షేమం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని గౌరు చరిత అన్నారు. గత పాలకులు ఫిష్‌ఆంధ్రా పేరుతో రూ.300 కోట్లు ఖర్చు పెట్టామన్నారని, ఒక్క మత్స్యకార కుటుంబమైనా బాగుపడిందా అని ఆమె ప్రశ్నించారు. 2014-19 కాలంలో మత్స్య కారుల సంక్షేమం కోసం రూ.788 కోట్లు ఖర్చు పెట్టామని, అంతే కాకుండా వలలు, పడ వలు, ఐస్‌బాక్సులు అందించామన్నారు. రాష్ట్రంలో 68,396 మంది మత్స్యకారులకు నెలనెలా పింఛన్లు అందిస్తున్నామని, చేపలవేట సమయంలో మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నామని తెలిపారు.

సయ్యద్‌షా దర్గా ఉరుసు



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని కుమ్మరిగేరిలో వెలసిన హజరత్ సయ్యద్‌షా రహీంషా దర్గాలో ఉరుసు ఉత్సవాలు నిర్వహించారు. ఆదివారం రాత్రి 9 గంటలకు హకీం బాషా సాహెబ్ ఇంటి నుంచి గంధం ఊరేగింపుతో దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉరుసును పురస్కరించుకని దర్గాలో భక్తులు ప్రత్యేక అమావాస్య పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు దర్గాను దర్శించుకున్నారు. దర్గా నిర్వాహకుడు హకీం బాషా ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని కట్టమంచి రామలింగారెడ్డి మున్సిపల్ మెమోరియల్ స్కూల్‌లో 2008-2009 మధ్య పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. వారు నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు గోపాల్‌రెడ్డి, హరిప్రసన్న, రాజేశ్వర రెడ్డి, మాదన్న, సుధాకర్, నారాయణ రెడ్డి, రామశాస్త్రి, త్యాగరాజు, రూతమ్మ, రంగమ్మ, అంజనాబాయి, పద్మావతి, స్వర్ణకుమారి, సరస్వతిలను పూలమాలతో, శాలువలతో ఘనంగా సత్కరించారు. వారికి పూల కుండీలను బహూకరించారు.

చెట్లమల్లాపురంలో కంటి వైద్యశిబిరం



పిల్లలకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్ జేజే

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జయలక్ష్మి నేత్రాలయ నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ ప్రవీణ్ జేజే ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలు మండలం చెట్లమల్లాపురం గ్రామంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ ఎస్ భూపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ జేజే గ్రామ స్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. సుమారు 46 మందికి శుక్లాలు ఉన్నాయని నిర్ధారించారు. శుక్లాలు ఉన్న వారికి ఉచితంగా శస్త్ర చికిత్సల నిమిత్తం కర్నూలలోని జయలక్ష్మి నేత్రాలయ ఆసుపత్రి ద్వారా చికిత్సలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే వారికి కంటి అద్దాలు కూడా అందజేస్తామన్నారు.

నేడు నగర పాలకలో వినతుల స్వీకరణ

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులను స్వీకరించనున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అన్నివిభాగాల అధికారులు అందు బాటులో ఉంటారని తెలిపారు. నగర ప్రజలు తమ కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం పునరుద్ధరణ చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు అబ్దుల్ దేశాయ్ పిలుపునిచ్చారు. ఆదివారం పాతబస్తీ గడియారం ఆసుపత్రి వద్ద కూలీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని అన్నారు. ఈ సమావేశంలో నగర కార్యదర్శి ఖాజాపాషా, మహబూబ్ బాషా, ఫకృద్దీన్, మద్దిలేటి, అంజనేయులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తులతో ర్యాలీ

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడికి నిరసనగా వైసీపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఆదివారం రాత్రి కొండారెడ్డి బురుజు వద్ద ముస్లిం మత పెద్దలు, అన్నీ పార్టీల నాయకులు, కార్యకర్తలు కలిసి కొవ్వొత్తులతో నిరసన తెలిపి నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ దాడిలో మరణించిన బాధిత కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా మన్నారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, పలు రాజకీయ పార్టీల నాయకులు, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటికుంటలతో జలసిరులు

- పెరగనున్న భూగర్భజలాలు
- మూగజీవాలకు తాగునీరు ● రైతులకు సాగునీరు
- 1,690 పంట కుంటల నిర్మాణమే లక్ష్యం

కల్లూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నీటికుంటలతో జలసిరులు పెరగనున్నాయి. భూగర్భజల నిల్వల పెంపే లక్ష్యంగా ఉపాధి హామీ పథకం అనుసంధానంతో గత టీడీపీ హయాంలో ఈపథకాన్ని నిర్వహించింది. సాగునీటితో పాటు గేదెలు, ఆవులు, ఎద్దుల తదితర మూగజీవాలకు తాగునీరు అందుబాటులో ఉంటుంది. దీంతో పాటు రైతులకు అదనపు ఆదాయం సమకూరేలా నమూనాలను అభివృద్ధి చేశారు అధికారులు. ఐదెకరాల లోపు వారికి అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి నీటి కుంటల తవ్వకానికి నాలుగింటిని ఎంపిక చేశారు. ఉపాధి కూలీలకు నాలుగు నమూనాలకు వరుసగా 120, 200, 420, 600 రోజుల పనిదినాల పూర్తికి అవకాశం కల్పించారు. క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించి స్వచ్ఛందంగా నీటికుంటల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది రాష్ట్ర ప్రభుత్వం.

నీటికుంట నిర్మాణమిలా..

ఐదు మీటర్ల చొప్పున వెడల్పు, పొడవు, రెండు మీటర్ల లోతు పంట కుంటల తవ్వకం కోసం రూ.60వేలు. పది మీటర్ల చొప్పున వెడల్పు, పొడవు, రెండు మీటర్ల లోతు పంట కుంటల తవ్వకం కోసం రూ. లక్ష. పదిహేను మీటర్ల చొప్పున వెడల్పు, పొడవు, రెండు మీటర్ల లోతు పంట కుంటల తవ్వకం కోసం రూ. 1.50 లక్షలు. ఇరవై మీటర్ల చొప్పున వెడల్పు, పొడవు, రెండు మీటర్ల లోతు పంట కుంటల తవ్వకం కోసం రూ. 2లక్షలను కేటాయించారు. నమూనాలను కూడా రైతులు ఎంపిక చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. అంచెల విధానంలో నిర్మించే కుంట గట్టు వెంబడి చుట్టూ పండ్లమొక్కల పెంపకం, కాయగూరలు,



ఎ.గోకులపాడులో నీటి కుంటలు తవ్వుతున్న ఉపాధి కూలీలు(ఫైల్)

ఆకుకూరల సాగు, నీటిలో చేపల పెంపకం తదితర మార్గాల్లో అదనపు ఆదాయం పొందవచ్చని ప్రోత్సహిస్తున్నారు. పంటకుంట నిర్వహణపై రైతులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

వర్షాకాలం నాటికి పూర్తి చేసేలా ప్రణాళిక:

కర్నూలు క్లస్టర్ పరిధిలోని కల్లూరు, ఓర్వకల్లు, కర్నూలు, క్రిష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లో 1,690 పంట కుంటల నిర్మాణే లక్ష్యంగా నిర్ధేశించుకున్నామని కర్నూలు ఏపీడీ పద్మావతి తెలిపారు. వర్షాకాలం (జూన్) నాటికి పూర్తిచేసేలా ప్రణాళికలు సిద్ధం చేశాం.

కర్నూలు క్లస్టర్ పరిధిలో వివరాలు

మండలం	లక్ష్యం	మంజూరు	పూర్తయినవి
కల్లూరు	250	196	9
కర్నూలు	330	120	10
ఓర్వకల్లు	390	244	7
క్రిష్ణగిరి	280	166	6
వెల్దుర్తి	440	425	18

మత సామరస్యంతో మెలగాలి

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్రజలు మత సామరస్యంతో మెలగాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో నందికొట్కూరుకు చెందిన ప్రముఖ మిమిక్రీ, రంగస్థల కళాకారుడు పి. ఖాదర్ బాబుకు అభినందన సభ, ఆయన త్రిపాత్రాభినయంతో నటించి, రూపొందించిన శ్రీకృష్ణ రాయబారం నుంచి 'శయన ఘట్టం' షార్ట్‌ఫిల్మ్ ప్రదర్శన, మిమిక్రీ షో, సంగీత విభావరి కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన టీజీ వెంకటేశ్ ఖాదర్ బాబును అభినందించారు. టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ ఇటీవల దురదృష్టకర పరిణామాలు, జాతిలో విద్వేషాన్ని కలిగించే విధంగా సంభవించారని అన్నారు. మనమందరం సమైక్యంగా ఉంటూ వాటిని ఎదుర్కోవాలని సూచించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కళాక్షేత్రం నిరంతరం కళల కాణాచిగా రూపొందిస్తున్నామని చెప్పారు. అనంతరం డాక్టర్ బాలమద్దయ్య, విశ్రాంత ఎస్పీ లక్ష్మీ నాయక్, ఏపీఎస్పీ డీఎస్పీ మహబూబ్ బాషాలు ప్రసంగించారు. అనంతరం గాయనీ గాయకులు సుధా రాణి, హబీబ్, బాలవెంకటేశ్వర్లు నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకులను అలరింపజేసింది. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కేజీ గంగాధర్‌రెడ్డి, సీనియర్ రంగస్థల నటులు పి. దస్తగిరి, క్రిష్టఫర్, మహమ్మద్ మియా, ఇనాయతుల్లా పాల్గొన్నారు.

దేశ సమైక్యతను తెలిపే కవిత్వం కవులు రాయాలి: దేశ సమైక్యతను తెలిపే కవిత్వాన్ని కవులు రాయాలని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలోగల సాహిత్య వేదిక సమావేశ హాలులో ప్రముఖ కవి గద్వాల ఈరన్న రాసిన



రంగస్థల కళాకారుడు ఖాదర్ బాబును అభినందిస్తున్న టీజీ వెంకటేశ్

'కవిగూర గంప' కవితా సంపుటిని ఆయ న ఆవిష్కరించి మాట్లాడారు. ఆదోని ప్రాంతానికి చెందిన కవి గద్వాల ఈరన్న పుస్తకాన్ని కర్నూలులో ఆవిష్కరించుకోవడం విశే షమని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ గద్వాల ఈరన్న ఆర్టీసీలో డిపో మేనేజరుగా పదవీ విరమణ చేసిన తర్వాత చక్కని కవితలు రాశారని, వాటిని పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీ యమని అన్నారు. టీజీవీ కళాక్షేత్రం తరపున టీజీ వెంకటేశ్ కవి ఈరన్నను శాలువ కప్పి, జ్ఞాపిక అందజేసి సత్కరించారు. అనంతరం కవి గద్వాల ఈరన్న మాట్లాడుతూ తనలోని భావాలను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కవిత్వం రాశారని చెప్పారు. కార్యక్రమంలో నగర బలిజ సంఘం నాయకులు సోమశేఖర్, గాండ్ల లక్ష్మన్న పాల్గొన్నారు.

రైళ్ల సర్వీసులను పునరుద్ధరించాలి

ఎంపీకి సీపీఐ నాయకుల వినతి



ఎంపీ నాగరాజుకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో రద్దు చేసిన ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను తక్షణమే పునరుద్ధరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామాంజనేయులు కోరారు. ఆదివారం ఎంపీ బస్తిపాటి నాగరాజును నగర కార్యదర్శి పి. రామకృష్ణారెడ్డితోపాటు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు, విజయవాడ, కోస్తా, ఉత్తరాంధ్ర ప్రాంత్రాలకు నడుస్తున్న రైళ్లను కరోనా సమయంలో రద్దు చేశారని, వాటిని పునరుద్ధరించాలని కోరారు. నాయకులు గోవిందు, యూ కుమార్, న్యాయవాదుల సంఘం జిల్లా కోశాధికారి దస్తగిరి, బంటు పల్లి సురేంద్ర పాల్గొన్నారు.

పొగాకు రైతులకు న్యాయం చేయాలి: పొగాకు రైతులకు న్యాయం చేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె. జగన్నాథం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఆదివారం ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో గత ఏడాది పొగాకు ధరలు బాగా ఉండటంతో ఈఏడాది కూడా కంపెనీలు ప్రతినిధులు ప్రోత్సహించడంతో రైతులు పొగాకు పంటలను పెద్ద ఎత్తున సాగుచేశారని, కానీ పంట దిగుబడి చేతికి అందాక ఒక్క సారిగా ధరలు పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నా రని వివరించారు. కోడుమూరు, ఆస్పరి, పత్తికొండ, వెల్దుర్తి, క్రిష్ణగిరి, ఆదోని తదితర ప్రాంతాల్లో విస్తరంగా సాగు చేశారని, పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో సి.మహేష్, మహమ్మద్ బాషా, రామదాసు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు వెనక్కి తీసుకోవాలి

ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు బంగి శ్రీధర్



మాట్లాడుతున్న బంగి శ్రీధర్

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు చెత్తకుప్పల దగ్గర కాపాలా కాసేలా తాడేపల్లి గూడెం మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు జారీ చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు బంగిశ్రీధర్ అన్నారు. ఆదివారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాలను వెనక్కి తీసుకోవా లన్నారు. రాత్రి 9 నుంచి 11 గంటల వరకు వీధుల్లో ప్రజలు చెత్తవే కుండా చూసే బాధ్యత అప్పగించడం దారుణమన్నారు. మున్సిపల్ కార్మికులు ఉండగా ఉన్నత చదువులు చదివిన శానిటేషన్ కార్యద ర్శులకు వేళ పాలా లేకుండా రాత్రి వేళ విధులు అప్పగించడం సరికా దన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సురేష్‌రెడ్డి, నగర అధ్య క్షుడు మురళీధర్ నాయుడు, చెన్నక్రిష్ణ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి

ఓర్వకల్లు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలన్నింటిని తక్షణమే అమలు చేయాలని మహిళా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరుణమ్మ, అలివేలమ్మ కోరారు. ఆదివారం ఓర్వక ల్లులోని పొదుపులక్ష్మి ఐక్య సంఘం కార్యాలయంలో జిల్లా స్థాయి క్లాసులు మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ధనలక్ష్మి అధ్యక్షతన జరిగాయి. అరుణమ్మ, అలివేలమ్మ మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు కూటమి ప్రభుత్వం మహిళలకు అనేక హామీలు ఇచ్చిందన్నారు. తల్లికి వందనం ప్రతి విద్యార్థికి రూ.15వేలు, 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఉచిత బస్సు సౌకర్యం వంటి హామీలు ఇచ్చారని, వాటిలో ఏ ఒక్క హామీలు కూడా అమలు కాలేదన్నారు. నాయకులు శ్యామల, సుజాత, పద్మ, నాగమ్మ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ విజేత కర్నూలు జట్టు

కర్నూలు స్పోర్ట్స్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): 54వ రాష్ట్ర స్థాయి సీనియర్ మెన్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌ను కర్నూలు జట్టు కైవసం చేసుకుంది. ఆదివారం కదిరి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హ్యాండ్ బాల్ ముగింపు పోటీల్లో కెనరా బ్యాంకు మేనేజర్ విజయకుమార్, పేబ్యాక్ సంస్థ అధ్యక్షులు ధనుంజయ నాయుడులు పాల్గొని విజేతలకు ట్రోఫీలు, పతకాలతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. కర్నూలు జట్టు మొదటి స్థానంలో, రెండో స్థానంలో వెస్ట్ గోదావరి జట్టు, మూడో స్థానంలో శ్రీసత్య సాయి జిల్లా జట్లు వరుస స్థానాల్లో గెలుపొందాయి.

విజేతలకు బహుమతి ప్రదానం

గూడూరు ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణంలో తిమ్మగురుడు స్వామి జాతరను పురస్కరించుకుని చైతన్య యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సైకిల్ పందెం, పరుగు పందెం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆదివారం గూడూరు పట్టణంలో చైతన్య యూత్ అధ్యక్షుడు మాజీ జడ్పీటీసీ ఎల్.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విజేతలకు బహుమతుల ప్రదానం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత 32 సంవత్సరాలుగా చైతన్య యూత్ ఆధ్వర్యంలో జాతర సందర్భంగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నామన్నారు. కౌన్సిలర్లు దస్తగిరి, బజారి, విజయుడు, కృష్ణమనోహర్, నాగరాజు, ఆచారి, ఉగ్రనరసింహులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి అమావాస్య పూజలు



కొమ్ము చెరువులో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఓర్వకల్లు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్ముచెరువు, కాల్వ, బైరాపురం గ్రామాల్లో వెలసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం అమావాస్య పర్వదినం కావడంతో భక్తులు పోటెత్తారు. కొమ్ముచెరువు ఆంజనేయస్వామి ఆలయానికి జిల్లాలోని నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఆంజనేయ స్వామికి ఆకు పూజలు జరిపి కాయకర్పూరాలు సమర్పించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కోడుమూరు రూరల్: మండలంలోని వెంకటగిరిలో గిడ్డాంజనేయస్వామికి అమావాస్య పూజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో వేకువజామున పంచామృతాభిషేకం, ఆకుపూజ నిర్వహించారు. గిడ్డాంజనేయ స్వామికి పట్టువస్త్రాలు, పూలమాలలు, ఆభరణాలు అలంకరించారు. అమావాస్య పురస్కరించుకుని దూరప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున చేరుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు భక్తులతో హనుమాన్ చాలీసా పఠనం చేయించారు.

జీవో నెంబర్ 20ని సవరించాలి

కేఎల్‌ఈఏ అధ్యక్షుడు చిన్న ప్రసన్న

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెంబరు 20ని సవరించాలని కర్నూలు లైసెన్స్‌డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ (కేఎల్‌ఈఏ) అధ్యక్షుడు చిన్నప్రసన్న అన్నారు. ఆదివా రం స్కందా భవనంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ యజమాని ఉల్లంఘనలకు వెంటనే నివేదించకపోతే ఎల్‌టీపీని బాధ్యుడిగా భావించడం సరికాదన్నారు. ఎల్‌టీపీలకు నిర్మాణ నియమాలు పరిశీలించడానికి, తనిఖీలు చేయడానికి బాధ్యత ఇచ్చారు అయితే ఉల్లంఘనలు ఆపాడానికి అమలు చేయడానికి ఎందుకు అధికారాలు ఇవ్వలేదన్నారు. ఎల్‌టీపీ తప్పు చేస్తే 5 సంవత్సరాలు పాటు లైసెన్స్ రద్దు చేయడం అన్యాయ మన్నారు. ప్లింత్ లెవెల్ తనిఖీ నివేదిక 7 రోజుల్లో సమర్పించకపోతే అది ఆటోమెటిక్ సర్టిఫికేషన్‌గా పరిగణించడబడుతుందని, దీని వల్ల ఎల్‌టీపీలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ప్రభుత్వం మరోసారి పునరాలోచించి



మాట్లాడుతున్న చిన్న ప్రసన్న

జీవో 20ని సవరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈసమావేశంలో సభ్యులు కామేష్ గౌడు, రఫీయుద్దీన్, షేక్ ముస్తాక్, ఏజాస్ అహ్మద్ పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు బెల్టులు ప్రదానం



క్రీడాకారులకు బెల్టులు ప్రదానం చేస్తున్న ఊట్ల రమేష్ బాబు

కర్నూలు కల్చరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ అండ్ టీజీబీ తైక్వాండో అకాడమీలో తైక్వాండో క్రీడలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు 4వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఊట్ల రమేష్‌బాబు బెల్టులు ప్రదానం చేశారు. ఆదివారం నగరంలోని పాతబస్టాండు సమీపంలోని నగరపాలక సంస్థ పార్కులో తైక్వాండోలో శిక్షణ అంద జేస్తున్నారు. ఈ సందర్భంగా శిక్షణలో ఉన్న క్రీడాకారులకు ఆయన బెల్టులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఊట్ల రమేష్‌బాబు మాట్లాడుతూ బాల్యం నుంచి క్రీడల్లో రాణించడం వల్ల ఆత్మ విశ్వాసం పెంపొందుతుందని అన్నారు. బ్లాక్ బెల్టు సాధించిన విద్యార్థులు బి.మంజునాథ్, టి.హరికృష్ణలను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో క్రీడ అసోసియేషన్ కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు, శిక్షకులు అజయ్, నందిని, అశ్విన్, భార్గవ్, శ్రీలిత, మల్లేష్, విశ్వాసరావు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

కర్నూలు క్రైం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రౌడీషీటర్లు నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, సత్ప్రవర్తనతో జీవించాలని జిల్లా పోలీసు అధికారులు సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆది వారం అన్ని పోలీస్ స్టేషన్లలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిం చారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆరోగ్యంపై అవగాహన

కర్నూలు హస్పిటల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని బుధవారపేట కేశవ మెమోరియల్ పాఠశాలలో ఆరోగ్యభారతి జిల్లా అభ్యాసక వర్గ కార్యకర్తలకు ఆరోగ్యం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆరోగ్యభారతి జిల్లా అధ్య క్షుడు డా.పి.మోక్షేశ్వరుడు, ఉపాధ్యక్షులు డా.ద్వారం ప్రభాకర్ రెడ్డిలు మాట్లాడుతూ గృహ వైద్యంతో ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. ఉపాధ్యక్షుడు నెఫ్రాలజిస్టు డాక్టర్ శ్రీధర్‌శర్మ కిడ్నీ వ్యాధుల నివారణ, చికిత్స గురించి వివరించారు. అశ్విని హాస్పిటల్ కు చెందిన గైనకాలజిస్టు డాక్టర్ సి.స్ఫూర్తి మాట్లాడుతూ ఎండా కాలంలో గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అశ్విని హాస్పిటల్ డైరెక్టర్ సి.శ్రీనివాసరెడ్డి ఊపిరితిత్తుల సమస్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య భారతి ప్రాంతీయ కార్యదర్శి డా.రామశర్మ, జిల్లా కార్యదర్శి బి.సత్యనారాయణరెడ్డి, గైనకాలజిస్టు డాక్టర్ ఎస్.వెంకటరమణ, ఆరోగ్యభారతి కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సంబంధించిన పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఏఐటీ యూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 14,000 మంది సిబ్బందికి 12 నెలల వేతనాలు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. అనంతరం యూనియన్ జిల్లా నూతన కౌన్సిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, నంద్యాల జిల్లా కార్యదర్శి సుంకయ్య పాల్గొన్నారు.

సుద్దవాగులో పూడికతీత పనులు

కర్నూలు న్యూసిటీ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా శ్రీరామ్‌నగర్, గణేష్‌నగర్, బృందావన్ కాలనీ తదితర పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న మురుగు సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఆదివారం నగర పాలక అధికారుల పర్యవేక్ష ణలో సుద్దవాగులో పూడికతీత పనులు ప్రారంభించారు. ఎక్స్‌కవేటర్‌తో సుద్దవాగులో పూడికను తొలగించారు. మరో నాలుగు రోజుల్లో పూర్తి చేసి వ్యర్థాలను అక్కడి నుంచి ట్రాక్టర్లలో తర లిం చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డీఎస్సీ-2003 ఫోరం కర్నూలు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో డీఎస్సీ-2003 పోరం కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సమావేశమయ్యారు. తమకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. సింగారి వెంకటేశ్వర్లు, పి.సుకుమార్, మజహర్ హుశేన్, బాలాజీరావు, మంగళలక్ష్మి పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయండి

కర్నూలు రూరల్ ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కర్నూలు జిల్లాల్లోని అన్ని డిపోల వద్ద నేడు, రేపు చేపట్టే రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి సి.మద్దిలేటి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం, మంగళవా రాల్లో ప్రతి డిపో ఎదుట జరిగే రిలేనిరాహార దీక్షల్లో ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

దంత వైద్యుడి కుటుంబానికి చేయూత

కర్నూలు హస్పిటల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనంతపురంలో మరణించిన దంత వైద్యుడు ఎ.మధు కుటుం బానికి ఐడీఏ ఫ్యామిలి బెనిఫిట్ స్కీం కింద చెక్కును ఇండియన్ డెంటల్ అసోసియేషన్ నాయకులు అందించారు. ఐడీఏ ఫ్యామిలి బెనిఫిట్ స్కీం కింద రూ.15.16 లక్షలు చెక్కును ఐడీఏ రాష్ట్ర అధ్యక్షుడు మురళీధర్ రెడ్డి, అజయ్ బెనర్జీ, కిషోర్ కుమార్ చెక్‌ను అందించారు.

అక్రమ లే అవుట్లు

- అనుమతి లేకుండానే వెంచర్లు వేస్తున్న 'రియల్' వ్యాపారులు
- ప్లాట్లు కొని మోసపోతున్న కొనుగోలుదారులు
- అక్రమ వెంచర్లను ధ్వంసం చేసిన కుడా అధికారులు


బీటీ రోడ్డు తొలగింపు (ఫైల్)


రాళ్లను తీసివేయిస్తున్న కుడా చైర్మన్ (ఫైల్)

ఆదోని, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు వేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా వెంచర్లు వేస్తున్నారు.

ఇష్టానుసారంగా వెంచర్లు

రియల్ ఎస్టేట్ వ్యాపారులు 5,6 ఎకరాలు కొనుగోలు చేసి ల్యాండ్ కన్వర్షన్, కుడా అనుమతి తీసుకోకుండానే ప్లాట్లు వేసి, రాళ్లు పాతుతున్నారు. అనుమతి లేకుండా ప్లాట్లు విక్రయిస్తున్నా గ్రామ పంచాయతీ వారు కాని, మున్సిపాలిటీ అధికారులు కాని అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

అడపాదడపా దాడులు..

అక్రమ వెంచర్లపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే పంచాయతీ, మున్సిపాలిటీ అధికారులు వెంచర్ల వద్దకు వెళ్లి హంగామా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదులు అందిన తర్వాత హద్దురాళ్ల తొలగించడం తప్ప ఎటువంటి చర్యలు తీసుకోవడ లేదు. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమాలకు అడ్డూ అదుపు లేకుంతో పోతోంది.

ఇవీ నిబంధనలు..

వెంచర్లు వేసే రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పించాలి. ముందుగా నిర్ణీత రుసుంను చలానా కట్టి ఆర్డీవోకు దరఖాస్తు చేయాలి. ల్యాండ్ కన్వర్షన్ పొందాక 30 ఫీట్ల రోడ్లను నిర్మించాలి. అండర్ గ్రౌండ్ డ్రైనేజీని సిమెంట్ కాంక్రీట్‌తో నిర్మించాలి. విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేసి, వాటికి కనెక్షన్లు ఇవ్వాలని అలాగే తాగునీటి సౌకర్యం కల్పించాలి. సామాజిక అవసరాల మేరకు వెంచర్‌లో 10శాతం స్థలాన్ని పంచాయతీ, మున్సిపాలిటీకి అప్పగించి, సదరు స్థలాన్ని మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీల పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలి. అనంతరం అనుమతి కోసం దరఖాస్తు చేయాలి. సంబంధిత అధికారులు అన్నీ పరిశీలించి అనుమతి మంజూరు చేస్తారు.

మోసపోతున్న కొనుగోలుదారులు ..

అనుమతులు పొందకుండానే రియల్ ఎస్టేట్ వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా వెంచర్లు వేసి, ప్లాట్లు విక్రయిస్తున్నారు. ఇవేవీ తెలియని కొనుగోలుదారులు ప్లాట్లు కొని మోసపోతున్నారు. ఈ వెంచర్లలో గృహం నిర్మించుకోవాలంటే అనుమతి తెచ్చుకోవలసి వస్తోంది. లే-అవుట్ రెగ్యులేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) కింద ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. ప్లాటు యజమానే భరించాల్సి ఉంటుంది.

అక్రమ లే అవుట్ వేస్తే వదిలేది లేదు

అక్రమ లే అవుట్లు వేసే వ్యాపారులను వదిలిపెట్టం. అనుమతి లేకుండా వెంచర్లు వేశారన్న సమాచారంతో ఈనెల 25న అధికారులతో సహా ఆదోని మండలం కె.నాగలాపురం, బైచిగేరి, మండగిరి, సదాపురం, గోనబావి, విరుపాపురం ఇస్వి, పెద్దహరివాణం, పెద్దతుంబళం, పెసలడంబ, బల్లెకల్ గ్రామాల్లో అక్రమ లే అవుట్లను గుర్తించాం. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడితే చూస్తూ ఊరుకోం. అనుమతి లేకుండా వేసిన లే అవుట్లలో రహదారులను ధ్వసం చేశాం.

- సోమిశెట్టి వెంకటేశ్వర్లు, చైర్మన్, కుడా

యువతలో చైతన్యం తీసుకురావాలి


పోస్టర్లను విడుదల చేస్తున్న డీఎస్పీ హేమలత

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా యువతలో చైతన్యం తీసుకురావాలని డీఎస్పీ మర్రిపాటి హేమలత సూచించారు. డీవైఎఫ్ పట్టణ కమిటీ ఈనెల 29,30 తేదీల్లో నిర్వహిస్తున్న యువ చైతన్య సైకిల్ యాత్ర పోస్టర్లను డీఎస్పీ ఆదివారం విడుదల చేశారు. డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, మద్యం, గంజాయికి దూరంగా ఉండాలన్నారు. వీటి నిర్మూలనకు డీవైఎఫ్ఐ సైకిల్ యాత్ర చేయడం అభినందనీయమన్నాడు. పట్టణ అధ్యక్షుడు వీరేష్, వెంకటేష్, నవీన్, మోహన్, సతీష్, వీరూ పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

- పోటీలను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్


పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించాలని మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్ పేర్కొన్నారు. ఆదివారం మున్సిపల్ మైదానంలో ముజీబ్ హమ్మద్ నిర్వహిస్తున్న ఫ్రెండ్‌షిప్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌ను కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రమేష్ యాదవ్, వ్యాపారవేత్త వినోద్ జైన్‌తో కలిసి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఆదోనిలో క్రీడాకారుల కోసం స్టేడియం నిర్మించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇక్కడి క్రికెట్ క్రీడాకారిణి అంజలి శర్వాణి జాతీయ మహిళా జట్టుకు ఎంపికైందని తెలిపారు.

ఆర్డీటీపై కక్ష సాధింపు తగదు

- కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి క్రాంతి నాయుడు



పత్తికొండ టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆరు దశాబ్దాలుగా రాయలసీమలో దళితులు, గిరిజనుల, బలహీన వర్గాలకు నిస్వార్థంగా సేవలందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు సంస్థపై బీజేపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరికాదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి క్రాంతి నాయుడు అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, పండ్ల తోటల అభివృద్ధి, హరిజన, గిరిజన, బలహీనవర్గాలకు నాణ్యమైన విద్య, వైద్యసేవలు అందిస్తూ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ, లాభాపేక్ష లేకుండా సంస్థ సేవలందిస్తుందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ ఇవ్వకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు, సీఎం చంద్రబాబుకు ఈ విషయంపై లేఖ కూడా రాశామన్నారు. సేవా కార్యక్రమాలు చేస్తున్న సంస్థకు ఇబ్బంది కలిగించవద్దని, లేనిపక్షంలో ప్రజాగ్రహానికి ప్రభుత్వాలు గురి కాక తప్పదని హెచ్చరించారు.

టీడీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి

మద్దికెర, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని టీడీపీ సాధికారిత కన్వీనర్ ఎస్.లక్ష్మీనారాయణ, పంచాయతీ సభ్యులు జంబునాథరాయుడు అన్నారు.ఆదివారం మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. మద్దికెర నుంచి బురుజుల వరకు అధ్వాన్నంగా ఉన్న రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శ్యాంబాబు రూ.5 కోట్లతో రోడ్డు వేయించారని, మండలాన్ని కరువు మండలంగా ప్రకటించారన్నారు. రైతులకు పనిముట్లు వంద శాతం రాయితీపై ఇచ్చారని, మండలంలో రూ.2కోట్ల పనులు చేశారని గుర్తు చేశారు. పారావిఠోబ, మీసేవా భీమరాజు ఉన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

సీఐ పులిశేఖర్‌కు ఎస్పీ ప్రశంస

తుగ్గలి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నేర నియంత్రణకు కృషి చేసిన పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్‌కు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రశంసాపత్రాన్ని అందించారు. నేర నియంత్రణ, ఫ్యాక్షన్, సమస్యాత్మక గ్రామాల్లో చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించి, నేరాలు తగ్గించేలా కృషి చేసినందుకు తనకు ప్రశాంసా పత్రం ఇచ్చినట్లు సీఐ తెలిపారు. సీఐకి తుగ్గలి, జొన్నగిరి ఎస్ఐలు కృష్ణమూర్తి, మల్లికార్జున శుభాకాంక్షలు తెలిపారు.


ప్రశంసాపత్రం అందుకుంటున్న సీఐ

29న లక్ష్మీతండాలో దేవర

తుగ్గలి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీతండాలో ఈ నెల 29న దేవర ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. సేవాలాల్‌కు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం


మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డా.గోపీనాథ్

ఆదోని టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మునిసిపల్ కాంప్లెక్స్ సమీపంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ట్రేడర్స్ అధినేత దేవేంద్రనాథ్ గుప్తా చలివేంద్రాన్ని ప్రారంభిచారు. క్లబ్ జిల్లా చైర్మన్ డా. గోపీనాథ్ మాట్లాడుతూ ఎండలు విపరీతంగా ఉన్నాయని ప్రజలు జాగ్రత్త వహించాలని కోరారు. వడదెబ్బకు గరికాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.

స్థలం ఇచ్చి, ఇప్పుడు ఖాళీ చేయమంటున్నారు

- పంచాయతీ వైఖరితో బాధితుడి ఆవేదన


గుడిసె వద్ద బాధితుడు జమేదార్ లక్ష్మీనారాయణ

మద్దికెర, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గిడ్డయ్య వీధిలో తమకు 30ఏళ్ల క్రితం పంచాయతీ వారు స్థలం ఇచ్చి ఇప్పుడు ఖాళీచేయాలని నోటీసు ఇచ్చారని బాధితులు జమేదార్ లక్ష్మీనారాయణ, శకుంతలమ్మ దంపతులు ఆవేదన వ్యక్తంచేశారు. బాధితుల కథనం మేరకు.. పంచాయతీ అనుమతితోనే గుడిసె వేసుకున్నామని, ఇంటి నెంబరు కూడా ఇచ్చారని, తాము ఇంటి పన్నులు కూడా కట్టామన్నారు. అయితే ఇప్పుడు ఖాళీ చేయమని నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ పంచాయతీకి సంబంధించి గత రికార్డులు తమ వద్ద లేవన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


పురస్కారాలను అందజేస్తున్న సంఘం నాయకులు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అభ్యుదయ దళిత సేవా సంఘం నాయకులు ఆదివారం ప్రతిభా పురస్కారాలను అందజేశారు. అంబేడ్కర్ భవనంలో సంఘం నాయకుడు కల్లుబోతుల రంగన్న విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్యే


విద్యార్థిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే పార్థసారథి ఆదివారం సన్మానించారు. విద్యార్థులు సాకరే వర్ష, బాలాజీ, షేక్ దిల్షాద్ భాను, పబ్బతి వైష్ణవి, ఉమేష్ రావ్, జి.పావని, హరిజన మయూరి, జె.సరిత, బి.రాఘవేంద్ర, విజయలక్ష్మి, బీబీలను అభినందించారు. ఎమ్మెల్యే మమాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పేరు తీసుకురావాలని సూచించారు.

ఈకేవైసీ చేసుకోవాలి

వెల్దుర్తి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుదారులు ఈనెల 30వ తేదీ లోపు ఈకేవైసీ పూర్తిచేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖరవర్మ సూచించారు. వీఆర్వోలు, డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, సచివాలయాల్లో సంప్రదించాలన్నారు.

బ్యాండ్‌సెట్ వ్యవస్థాపకుడి మృతి

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వంగార్ బ్యాండ్ సెట్ వ్యవస్థాపకుడు స్వంగార్ రాముడు (65) ఆదివారం మృతి చెందారు. బ్రహ్మయ్యకోట్టాల వీధిలో నివాసముంటున్నాడు. 1985లోనే పట్టణంలో ప్రథమంగా బ్యాండ్‌సెట్ ఏర్పాటు చేశారు. రాజకీయ నాయకులకు ఆయన సేవలు చేశారు. సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య, రాజాసాహెబ్, కారన్న, ప్రజానాట్య మండలి నాయకులు వర్మ, చాకలి వీరేష్, నెట్టికంటయ్య, నాగిరెడ్డి నివాళి అర్పించారు.

టీడీపీ ప్రభుత్వంతో మత్స్యకారుల దశ మారింది

- ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



పత్తికొండ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వంతో మత్స్యకారుల దశమారిందని ఎమ్మెల్యే కేఈ.శ్యాంబాబు అన్నారు. ఆదివారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు రూ.20వేల ఆర్థిక సాయాన్ని సీఎం చంద్రబాబు విడుదల చేశారన్నారు. ఈ పథకం ద్వారా 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. మత్స్యకార కుటుంబాల కోసం పడవలు, సరంజామాతోపాటు ఎగుమతులకు చర్యలు తీసుకుని సీఎం చంద్రబాబు ఆదుకున్నారని, వెనుకబడిన వర్గాలకు పార్టీ వెన్నంటి నిలుస్తుందని పేర్కొన్నారు.

రోడ్డుపైనే మురుగు


అలారుదిన్నెలో రోడ్డుపైనే పారుతున్న మురుగు

దేవనకొండ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలారుదిన్నె గ్రామంలో కాలువలు లేకపోవడంతో రోడ్డుపైనే మురుగు ప్రవహిస్తోంది. కనీసం నడవడానికి కూడా సాధ్యపడటం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య సిబ్బంది పనిచేయడం లేదని దుర్వాసన వెదజల్లుతోందని పంచాయతీ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

కలపరిలో వైద్య శిబిరం

ఆస్పరి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలపరి గ్రామంలో 15 రోజులుగా విష జ్వరాల ప్రబలయ్యాయి. దీంతో గ్రామంలో మూడు రోజులుగా వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. వైద్యాధికారులు బాలకృష్ణ, రఘురాం రెడ్డి ఆధ్వర్యంలో చికిత్స చేశారు. ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి జ్వర పీడితులను సుమారు 60 మంది రోగులకు చికిత్స అందించారు. తీవ్ర అస్వస్థతకు గురైన బాధితులను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. తాగునటిని కాచి చల్లార్చి తాగాలని, పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని వైద్యులు సూచించారు.


వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

రైలు కిందపడి తీవ్ర గాయాలు

ఆదోని, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన రాజశేఖర్ ప్రమాదవశాత్తు రైలు కింద పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. వివరాల మేరకు.. రైల్వే ఎస్ఐ గోపాల్ తెలిపిన మేరకు.. గుంతకల్ నుంచి ఆదోనికి 16382 నెంబర్ గల రైలులో ఎక్కాడు. అయితే ఆదోనిలోని నాలుగో నెంబర్ ప్లాట్‌ఫ్లాంపై దిగుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడటంతో కుడి చేయి పూర్తిగా తెగిపడింది. గమనించిన రైల్వే ఎస్ఐ గోపాల్, తమ సిబ్బంది హుటాహుటిన రాజశేఖర్‌ను ఏరియా ఆసుపత్రిఇకి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి తరలిస్తే చేయి వస్తుందని చెప్పడంతో రాజశేఖర్ బంధువులు హుటాహుటిన కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

టోల్ ప్లాజా ఎంప్లాయీస్ కమిటీ

క్రిష్ణగిరి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమకతాడు టోల్ ప్లాజా ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టి.శివరాం తెలిపారు. అధ్యక్షుడిగా ఆర్.కే.వి.రాజు, ప్రధాన కార్యదర్శిగా కే.గోపాలకృష్ణ, కోశాధికారిగా బి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా రాముడు, మహేష్ నాయుడు, మహేష్, సహాయ కార్యదర్శులుగా మధు, నాగేంద్రుడు, బాగ్యరాజు, సభ్యులుగా వెంకటేశ్వర్లు, మద్దయ్య, ఖాన్, వలి, నాయుడు, రామిరెడ్డి, సురేష్, శ్రవణ్, రమణారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఆద్వర్యంలో జరిగిన జనరల్ బాడి సమావేశంలో కమిటీని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు.

టమోటా లారీ బోల్తా

పత్తికొండ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పత్తికొండ బైపాస్ రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున టమోటా లార్తీ బోల్తాపడింది. సీఐ జయన్న తెలిపిన వివరాల మేరకు.. లారీలో మదనపల్లి నుంచి ఆదోనికి టమోటాలు తీసుకెళుతున్నారు. అయితే ఎవరికీ ప్రమాదం చోటుచేసుకోలేదు. లారీని క్రేన్ సాయంతో రోడ్డుపై నుంచి తొలగించారు.


బోల్తాపడ్డ టమోటా లారీ

గాలి వాన బీభత్సం

- పత్తికొండలో విరిగిన చెట్లు, ఆస్పరిలో పిడుగులు
- దేవనకొండ మండలంలో ఓ మోస్తరు వర్షం


పత్తికొండ: హోసూరు రహదారిలో కూలిన చెట్టు


పత్తికొండ ఆర్డీవో కార్యాలయం వద్ద విరిగిన చెట్టు కొమ్మ

పత్తికొండ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. హోసూరు రహదారిలో చెట్టు రోడ్డుకు అడ్డంగా కూలిపోయింది. ఆ సమయంలో వెళుతున్న ఆటోపై చెట్టు కొమ్మలు పడ్డాయి. అయితే ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. అలాగే ఆర్డీవో కార్యాలయం వద్ద కూడా చెట్టు కొమ్మ విరిగి పడింది. సెలవు కావడంతో ప్రజలెవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

కొబ్బరి చెట్టుపై పిడుగు

ఆస్పరి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోగలుగల్లు గ్రామ సమీపంలోని కొబ్బరి చెట్టుపై ఆదివారం పిడుగు పడింది. దీంతో చెట్టుపై మంటలు చెలరేగాయి. మండలంలోని తురువగల్లు, దొడగొండ, తంగరుడోణ, కల్లపరి, గ్రామాలలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా పిడుగులు పడడంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందారు.


దేవనకొండలో కురుస్తున్న వర్షం

దేవనకొండలో వర్షం

దేవనకొండ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం సాయంత్రం ఓ వర్షం కురిసింది. ఎండ వేడిమితో ఇబ్బందులు పడిన ప్రజలకు సాయంత్రం కురిసిన వర్షంతో కాస్త ఉపశమనం కలిగింది. కరివేముల, కప్పట్రాళ్ల, ఈదుల దేవరబండ, కుంకనూరు, తెర్నేకల్ గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురువడంతో వేసవి దుక్కులు చేసేందుకు ఉపయోగపడుతుందని రైతులు తెలిపారు.

ప్రయాణికుల అవస్థలు

- షెడ్డును ఆక్రమించిన వ్యాపారులు
- రోడ్డుపైనే ప్రయాణికులు
- తిమ్మారెడ్డి బస్టాండు దుస్థితి


తిమ్మారెడ్డి బస్టాండులో షెడ్డును ఆక్రమించిన వ్యాపారులు

ఆదోని టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆలూరు రోడ్డు వదంద తిమ్మారెడ్డి బస్టాండు వద్ద కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్న వర్షం కురిస్తే చాలు బస్టాండు ఆవరణ అంతా బురదమయంగా మారుతోంది. షెడ్డును వీధి వ్యాపారులు ఆక్రమించడంతో రోడ్డుబయటే ఎదురుచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు.

మా పరిధిలో లేదు



తిమ్మారెడ్డి బస్టాండు ప్రైవేటు స్థలంలో ఉంది. మా పరిధిలో లేదు. ప్రయాణికుల సౌకర్యార్థం ఒక కంట్రోలర్‌ను ఏర్పాటు చేశాం. అభివృద్ధి చేసేందుకు మాకు అనుమతి లేదు. **- రఫిక్, ఆర్టీసీ, డీఎం**

తాత్కాలికంగా ఏర్పాటు

శ్రీనివాస భవన్ హోటల్ ఎదురుగా ఉన్న స్థలంలో గతంలో పాత బస్టాండ్ ఉండేది. అయితే ఆస్పరి రోడ్డులో కొత్త బస్టాండ్ నిర్మించడంతో పట్టాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని అధికారులు పాత బస్ స్టాండ్‌ను తొలగించారు. అయితే గుంతకల్, ఆలూరు, పుణ్య క్షేత్రాలైన ఉరుకుంద, మంత్రాలయం, ఎల్లార్తి కర్ణాటక ప్రాంతాలైన బళ్ళారి, సిరిగుప్ప సింధనూర్, బెంగుళూరు హుబ్లీ ప్రాంతాల ప్రయాణికుల సౌకర్యార్థం నాటి ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి తాత్కాలికంగా తిమ్మారెడ్డి బస్ స్టాండ్‌ను ఏర్పాటు చేశారు.

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు


భక్తులతో కిటకిటలాడుతున్న మఠం ప్రాంగణం

మంత్రాలయం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం కిటకిటలాడింది. ఆదివారం అమావాస్య కావటంతో ఆయా ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, ఆర్టీసీ బస్టాండు,నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. క్యూలైన్స్లు, పరిమళప్రసాదం వద్ద భక్తుల సందడిగా మారింది. రాఘవేంద్ర సర్కిల్ నుంచి నాల్గు ప్రధాన రహదారులు కి.మీ.మేర వాహనాలు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది.

వెండి గజవాహనంపై ప్రహ్లాదరాయలు


వెండి గజవాహనంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి గజవాహనంపై బంగారు అంబారిలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి, మంచాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య వెండి గజవాహనంపై స్వర్ణ అంబారిలో వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్టించి పీఠాధిపతి మహామంగళహారతితో ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు భక్తులను ఆశీర్వదించారు.

కాంగ్రెస్ ఆలూరు ఇన్‌చార్జి హత్య దుర్మార్గం

● బీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అమ్రేష్

మంత్రాలయం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణను అతిదారుణంగా హత్య చేయడం దుర్మార్గమని బీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రామతీర్థం అమ్రేష్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లక్ష్మీనారాయణ వెళ్తున్న వాహనాన్ని లారీతో గుద్ది, వేటుకొడవళ్లతో నరికి చంపడం శోచనీయమన్నారు. సామాజిక కార్యకర్తలను హత్య చేయడం మానవ హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి నిందితులను 24 గంటల్లో పట్టుకుని రిమాండ్‌కు తరలించి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు.

ఎక్సైజ్ దాడులు

● 12 మద్యం బాక్సుల స్వాధీనం.. ఇద్దరి అరెస్టు


పట్టుబడిన కర్ణాటక మద్యంతో ఎక్సైజ్ సీఐ, ఎస్ఐ

కోసిగి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): అక్రమ కర్ణాటక మద్యంపై ఎక్సైజ్‌శాఖ సిబ్బంది మెరుపు దాడులు నిర్వహించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు ఆదేశాల మేరకు కోసిగి ఎక్సైజ్ సీఐ భార్గవ్‌రెడ్డి, ఎస్ఐ కార్తీక్ సాగర్ ఆధ్వర్యంలో దాడులు చేపట్టారు. మండలంలో కందుకూరు గ్రామానికి వెళ్లే రోడ్డులో శ్రీగురు రాఘవేంద్ర పంప్ హౌస్‌వద్ద అగసనూరు గ్రామానికి చెందిన గొర్లి చిన్న భీమేష్, కోసిగి సిద్దప్ప పాలెం చెందిన బీ.రామకృష్ణ అనే ఇద్దరు వ్యక్తులు అక్రమ మద్యం కలిగిన 12 బాక్సులు తరలించేందుకు సిద్ధం చేశారు.ఆదివారం పక్కా సమాచారంతో దాడులు చేసి 1152 డిప్స్ 12 బాక్సులు ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విక్సీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందన్నారు. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది భరత్, మునిరంగడు, రవికుమార్ పాల్గొన్నారు.

మఠానికి విరాళాలు

మంత్రాలయం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి పలువురు భక్తులు ఆదివారం విరాళం అందజేశారు. చెన్నైకు చెందిన సావిత్రి బాలాజి అనే భక్తురాలు రూ. రెండు లక్షలు, సరస్వతి అనే భక్తురాలు రూ.50వేలు అన్నదానానికి, బెంగళూరుకు చెందిన కుమారి అనే భక్తురాలు రూ.5 లక్షలు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి,సురేష్ కోణాపూర్ లు తెలిపారు. ఆదివారం వేర్వేరు సమయాల్లో కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారని తెలిపారు. దాతల కుటుంబాలను పీఠాధిపతి ఆశీర్వదించారు. కార్యక్రమంలో అనంతపురాణిక్, రవికులకర్ణి, జేపీ స్వామి, నరసింహ దేశాయ్, శ్రీపాద ఆచార్‌లు పాల్గొన్నారు.

ఆర్డీటీ సెట్ రద్దు

కోసిగి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పాసైన విద్యార్థుల కోసం ప్రతి ఏటా నిర్వహిస్తున్న ఆర్డీటీ సెట్ ఈ ఏడాది రద్దు అయినట్లు కోసిగి ఏరియా ప్రోగ్రాం కోఆర్డినేటర్ కృష్ణయ్య తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వివిధ సాంకేతిక కారణాలతో ఈఏడాది ప్రవేశ పరీక్షను రద్దుచేస్తున్నట్లు డైరెక్టర్లు తెలిపారన్నారు. ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ ఖాతాను మూడు రోజుల క్రితం సీజ్ చేశారన్నారు. అయితే, స్థానిక నిధులతో పరీక్షలను నిర్వహించాలని తొలుత నిర్ణయించుకొని ప్రాంతాల వారీగా దరఖాస్తులు కూడా స్వీకరించినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కార్పొరేట్ కళాశాలల్లో చదివిస్తే రూ2. కోట్లకుపైగా నిధులు అవసరం అవుతాయన్నారు. నిధులు డ్రా చేయడంలో సాంకేతిక సమస్యలు రావడంతో ముందుగానే సెట్ రద్దు నిర్ణయం తీసుకున్నారన్నారు.

శిథిలావస్థలో గట్లు

● ఎల్లెల్సీ కాలువలో పెచ్చులూడుతున్న వైనం
● పట్టించుకోని అధికారులు

గోనెగండ్ల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర కాలువ గోనెగండ్ల సెక్షన్ పరిధిలో ఎల్లెల్సీ కాలువ గట్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. కాలువ గట్లకు ఉన్న సిమెంట్ పెచ్చులూడిపోతున్నాయి. దీంతో కాలువలో నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోతుంది. విడుదల అయిన నీరు


ఎల్లెల్సీ కాలువ గట్లపై పిచ్చిమొక్కలు

సక్రమంగా చేరుతుందా లేదా అనే అనుమానాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మిగనూరు నుంచి కోడుమూరు సెక్షన్ వరకు ఎల్లెల్సీ కాలువ గట్లు చాలా వరకు శిథిలమయ్యాయి. గట్లపై పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. ఎమ్మిగనూరు, కడిమెట్ల, గోనెగండ్ల హెచ్ కైరవాడి, వేముగోడు, కోడుమూరు వరకు గట్లు శిథిలమయ్యాయి. కొందరు అక్రమ సాగు దారులు తమ పంట పొలాలకు నీటిని మళ్లించుకునేందుకు కాలువ గట్లలను పగులగొట్టి పైపుల ద్వారా నీటిని తాము సాగు చేసుకున్న పొలాలకు మళ్లించుకుంటుండటంతో అవి శిథిలావస్థకు చేరాయి. వాటికి మరమ్మతులు చేసేందుకు ఉపాధి హామీ నిధుల కింద ఖర్చు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. కొన్నేళ్ల క్రితం గట్లకు మరమ్మతులు చేసేందుకు నిధులు విడుదలైన కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. సాగునీటిసంఘం నాయకులతో పను


గోనెగండ్ల గ్రామం వద్ద శిథిలమైన ఎల్లెల్సీ కాలువ గట్టు

లు చేయించేందుకు ఇరిగేషన్ అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇటీవల ఇరిగేషన్ ఎస్ఈ కాలువల వెంట పర్యటించి శిథిలమైన గట్లను ఆయన పరిశీలించారు. దీంతో ఏఈలు అంచన వ్యయం వేసి ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిసింది. ఈ ఏడాది తుంగభద్రడ్యాంలో నీరు పంట సాగుకు నీరు విడుదల అయ్యేలోపు కాలువ గట్లు మరమ్మతులు చేయాలని ఎల్లెల్సీ ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

గట్లకు మరమ్మతులు చేయాలి

ఎమ్మిగనూరు, గోనెగండ్ల కోడుమూరు సెక్షన్ పరిధిలోని కాలువ గట్లు శిథిలావస్థకు చేరాయి. వాటి మరమ్మతుల కోసం పనులు వెంటనే చేపట్టాలి. వచ్చే ఏడాది విడుదలయ్యే నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలి.

\- దరగల మాబు, గోనెగండ్ల

ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం

గోనెగండ్ల సెక్షన్ పరిధిలో ఎల్లెల్సీ కాలువ గట్లు అక్కడక్కడా శిథిలావస్థకు చేరాయి. వాటి మరమ్మతుల కోసం వ్యయం అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాం. నిధులు విడుదల అయిన వెంటనే పనులు చేపడతాం.

\- ఉదయ్‌భాస్కర్, ఎల్లెల్సీ ఏఈ, గోనెగండ్ల

అకాల వర్షం..అపార నష్టం

కౌతాళం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేళిగనూరు, నదిచాగి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. అకాలవర్షానికి వరి రైతులకు అపారనష్టం కలిగింది. ఈదురు గాలులతో కూడిన వర్షానికి చేతికి వచ్చిన వరి పంట నేలపాలైంది. ఇప్పటికే కోసిన వరిపంటను కల్లాల్లో ఆరబెట్టగా ఒక్కసారిగా వర్షం రావడంతో ధాన్యం తడిసి ముద్దాయినది. దీంతో రైతన్నలకు అపార నష్టం కలిగించింది. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని వరి రైతులు కోరుతున్నారు.

కోసిగిలో దంచి కొట్టిన వాన

కోసిగి: మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం వర్షం దంచి కొట్టడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. రెండు, మూడు రోజులుగా ఉక్కపోతతో అల్లాడిపోయిన ప్రజలు ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకు న్నాయి. మేఘాలు కమ్ముకోవడంతో సుమారు అరగంట పాటు వర్షం పడింది. కోసిగి పంచాయతీ కార్యాలయం ఎదురుగా ప్రధాన రోడ్డుపై వర్షం నీరు


కోసిగి పంచాయతీ కార్యాలయం ప్రధాన రోడ్డు ముందు చెరువును తలపిస్తున్న వర్షపు నీరు


నీట మునిగిన వరి ధాన్యం

చేరడంతో కుంటను తలపించింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదోని వెళ్లే ప్రధాన రోడ్డుపై వర్షం నీరు పొంగి పొర్లాయి.

వారం రోజులుగా కోసిగిలో 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఎండ వేడిమికి అల్లాడిపోయిన ప్రజలకు ఆదివారం కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడింది.

గోనెగండ్ల: మండల కేంద్రమైన గోనెగండ్లతో పాటు గాజులదిన్నె, హెచ్ కైరవాడి, అలువాల, కులుమాల గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపుతో కూడిన ఒక మోస్తారు వర్షం కురిసింది. గోనెగండ్ల పలు వీధుల్లో వర్షపునీరు పారడంతో జనానికి ఎండ వేడిమి నుంచి కొంత ఉపశమనం కలిగింది. రెండు మూడు రోజులు వాతావరణం చల్లగా ఉంటుందని ప్రజలు తెలుపుతున్నారు.

ఘనంగా లక్ష పుష్పార్చన

కౌతాళం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా లక్షపుష్పార్చన నిర్వహించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈవో విజయరాజు ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అంతకుముందు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలతో అలంకరించారు. తూర్పు రాజగోపురం నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వంటకాలు చేసి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయంలోని సత్రంలో ఉచిత అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

మే డేను జయప్రదం చేయండి

కోసిగి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మే డే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు కోరారు. ఆదివారం కోసిగిలోని సీఐటీయూ కార్యాలయం లో మండల కార్యదర్శి రాముడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్మిక చట్టాలను కాలరాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు నష్టాలు కలిగించే విధానాలకు వ్యతిరేకంగా మేడే స్ఫూర్తితో పోరాడాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు హెబ్సిబారాణి, లూసమ్మ, గుర్రం వీరేష్, గోపాల్, హనుమంతు, వెంకటేశ్, నరసింహులు ఉన్నారు.

నేటి నుంచి సమ్మర్ క్యాంపు

కోసిగి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు గ్రంథాలయాల్లో సమ్మర్ ఆర్గనైజేషన్ ప్రోగ్రాం ద్వారా సమ్మర్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి దుల్లయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోమగుంట్ల కోటేశ్వరరావు ఆదేశాల మేరకు గ్రంథాలయాల్లో వేసవి పునశ్చరణ కార్యక్రమం ద్వారా కథలు, సృజనాత్మక నృత్యాల పుస్తకాలు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచుతామన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ప్రాంతంలో బాలికల కోసం మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని సీఆర్పీఎఫ్ జిల్లా కన్వీనర్ లింగన్న కోరారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎమ్మిగనూరులో బాలికల గురుకుల పాఠశాల లేకపోవటంతో అనేకమంది చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి సంబంధిత శాఖమంత్రితో మాట్లాడి బాలకల గురుకుల పాఠశాల ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారన్నారు.

నౌలేకల్ మాజీ సర్పంచ్ మృతి

పెద్దకడుబూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నౌలేకల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లేపాక్షి(68) మృతి చెందారు. లేపాక్షి ముచ్చుగిరిలో నివాసం ఉండేవాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఉంటూ వచ్చారు. ఆయన మృతిపై మండలంలోని నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

టీడీపీ కార్యకర్త..

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలం ఏనుగుబాల గ్రామంలో ఆదివారం టీడీపీ కార్యకర్త మేషక్(45) గుండెపోటుతో మృతి చెందారు. స్థానికుల వివరాల మేరకు.. మేషక్‌కు ఆదివారం ఉదయం లోబీపీ రావడంతో గుండెలో నొప్పి వచ్చింది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య మేరి, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

బస్టాండులో ప్రైవేటు వాహనాలను పార్కింగ్ చేస్తే చర్యలు: ఆర్ఎం



ఆర్టీసీ బస్టాండును పరిశీలిస్తున్న ఆర్ఎం శ్రీనివాసులు

కోసిగి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండులో ప్రైవేట్ వాహనాలు, ఆటోలు పార్కింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని ఏపీఎస్ ఆర్టీసీ ఆర్ఎం డి. శ్రీనివాసులు హెచ్చరించారు. ఆటోల అడ్డాగా.. ఆర్టీసీ బస్టాండు.. అనే కథనాన్ని ఈ నెల 22న 'ఆంధ్రజ్యోతి' ప్రచురించింది. దాంతో కర్నూలు ఆర్ఎం డి.శ్రీనివాసులు స్పందించి ఆదివారం కోసిగి ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించారు. బస్టాండులో పార్కింగ్ చేసిన ఆటో యజమానులను హెచ్చరించారు ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షితంగా ప్రయాణాలు చేయాలని తెలిపారు. బస్టాండులో ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కోసిగి ఆర్టీసీ బస్టాండులో త్వరలో కార్గో సర్వీసు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే కోసిగి ఆర్టీసీ బస్టాండులో సుమారు 28 షాపులు ఉన్నాయనీ ఆర్టీసీ బస్టాండు వెనుక భాగంలో సైకిల్ స్టాండు కోసం త్వరలో టెండర్లు నిర్వహిస్తామన్నారు. ఆయన వెంట ఆదోని ఆర్టీసీ డీఎం రఫీక్, కర్నూలు ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ చలపతి, సిబ్బంది ఉన్నారు.

అర్హులకు పింఛన్ మంజూరు చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పింఛన్ మంజూరు చేయాలని వైఎస్ఆర్‌సీపీ బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి వీరుపాక్షిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు సంవత్సరం పూర్తవుతున్నా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. తమ ప్రభుత్వంలో అర్హతను ప్రామాణికంగా తీసుకొని పార్టీలకు అతీతంగా 13లక్షల మందికి కొత్త పింఛన్లు మంజూరు చేశామన్నారు. గానీ ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొత్తగా ఒక్క పింఛన్ కూడా మంజూరు చేయలేదని, ఉన్న పింఛన్లను వివిధ కారణాలు చూపుతూ రద్దు చేయడం బాధాకరమన్నారు. సమావేశంలో గణపతి, దాదా, రాజశేఖర్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): హమాలీ కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సివిల్ సప్లై కార్యాలయంలో రాజు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు మాట్లాడుతూ శారీరక పనులు చేస్తున్న హమాలీలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి సంక్షేమ పథకాలు ఇవ్వడం లేదని అన్నారు. ఎన్నికల ముందు పింఛన్లు ఇస్తామని హామీ ఇవ్వడంతోనే సరి పెడుతున్నారని ఆరోపించారు. నాలుగు లేబర్ చట్టాలను రద్దు చేసేంతవరకు పోరాడాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు.


హమాలీలతో మాట్లాడుతున్న రాముడు

ఉల్లి రైతు కుదేలు

● మార్కెట్లో క్వింటం ధర రూ.300 నుంచి రూ.900లోపే..


పొలంలో వదిలివేసిన ఉల్లి పంట

గోనెగండ్ల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): అకాల వర్షం ఉల్లి రైతును కుదేలు చేసింది. గోనెగండ్లకు చెందిన రైతులు కొందరు ఆదివారం ఉల్లి పంటను కోశారు. అనుకోకుండా వర్షం కురియడంతో పంట కాస్త వర్షానికి తడిసిపోయింది. రైతులు లబోదిబోమంటున్నారు. మార్కెట్ లో అమ్మకాలు జరిపితే వచ్చే సొమ్ముతో కూలీలు కూడా గిట్టుబాటు కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేముగోడు, పులకుర్తికి చెందిన పెద్ద భూస్వాములు సైతం మార్కెట్‌లో ధర పలకడం కష్టమని తెలుపుతున్నారు. తడిసిన ఉల్లిని గ్రామాల్లో వ్యాపారులు క్వింటం రూ.500కు అమ్మకాలు జరపాలని కోరుతుండటంతో రైతులకు ఎటు పాలుపోవడంలేదు. రూ.2వేల నుంచి 3వేల వరకు పలికిన ధర క్వింటం రూ.900కు పడిపోయింది. ప్రసుత్తం వర్షంకు ఉల్లి నానడంతో రూ.300 నుంచి రూ.500 ధర పలుకుతుండటంతో ఆందోళన చెందుతున్నారు.

మత్స్యకారుల దశ మారింది

● ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వం
● ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం రాకతో మత్స్యకారుల దశమారిందని ఎమ్మెల్యే బీవీ జయనా గేశ్వర రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు మత్స్యకారుల వేట నిషేద సమయంలో ఒక్కొక్క కుటుం బానికి రూ. 20వేల చొప్పున ఆర్థికసాయం అందించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం హర్షనీయమన్నారు. రాష్ట్రంలో 68396 మత్స్యకారుల కుటుంబాలకు ప్రతి నెల పింఛన్లు అందజేస్తున్నామన్నారు. మరణిస్తే రూ. 10లక్షల ఎక్స్‌గ్రేసియా చెల్లిస్తున్నామన్నారు. వేటకు వెళ్లే బోట్లకు డీజిల్‌పై సబ్సిడీ ఇస్తున్నామన్నారు. చేపల ఎగుమతుల్లో మన రాష్ట్రం ముందు వరుసలో ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను దశలవారీగా అమలుచేస్తోందన్నారు. హామీల అమలుపై వైసీపీ లేని పోని ఆరోపణలు చేస్తూ బురదచల్లే ప్రయత్నం చేస్తోందని దీన్ని ప్రజలు నమ్మేస్థితిలో లేరని పేర్కొన్నారు.

మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అండ

మంత్రాలయం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు మత్స్యకార కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఒక్కొక్క కుటుంబానికి రూ.20వేలు సాయం విడుదల చేశారన్నారు.

రైల్వే పనులను అడ్డుకున్న రైతులు


పనులను అడ్డుకుంటున్న రైతులు

పెద్దకడుబూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గవిగట్టు గ్రామంలో జరిగే రైల్వే అండర్ బ్రిడ్జి పనులను ఆదివారం రైతులు అడ్డుకున్నారు. గవిగట్టు దగ్గర నిర్మిస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జి పనుల కోసం కోట్ల విలువచేసే తమ భూములను ఇచ్చామన్నారు. తమ భూములకు ప్రభుత్వం తక్కువ పరిహారం ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. ఎకరా భూమి కోట్లలో పలుకుతుందని, అయితే తమకు వేలల్లో పరిహారమిచ్చి తమ భూములను తీసుకునేందుకు చూస్తున్నారన్నారు. తమకు తగినంత పరిహారం ఇస్తేనే తమ భూములను ఇస్తామని రైతులు స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో జింక మృతి

మంత్రాలయం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం, చెట్నహల్లి హైవే రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం తెల్లవారుజామున రోడ్డు దాటుతున్న జింకను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో రోడ్డు పక్కన పడిపోయింది. మృతి చెందిన జింక రోడ్డుపైనే పడి ఉండటం గమనించిన చాలా మంది రైతులు, ప్రజలు ఫారెస్టు అధికారులకు సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నించిన స్పందించలేదు. ఫారెస్టు అధికారులు స్పందించి జింక మృతదేహన్ని పోస్టుమార్టం చేసి అంత్యక్రియలు చేయాలని కోరుతున్నారు.

ఆర్థిక సాయం అందజేత

గోనెగండ్ల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మిత్రుడి కూతురుకి పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయంచేసి అండగా నిలిచారు. మండల కేంద్రంలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన జాకీర్ కూతురు హసీనా అనారోగ్యంతో బాధపడేది. విషయం తెలుసుకున్న పదవ తరగతి పూర్వవిద్యార్థులు కొందరు చిన్నారి హసీనా ఆస్పత్రి ఖర్చులకు గాను ఆదివారం రూ. 24వేలు ఆర్థిక సాయం అందజేశారు. అన్ని విధాలుగా స్నేహితుడి కుటుంబానికి అండగా ఉంటామని వారు భరోసా ఇచ్చారు.